వార్త
ఆదివారం
22 జూన్, 2025



# పురుషోత్తమ ధామం
# పూరీ జగన్నాథం..



# అట్లీ సినిమాలో దీపికా పదుకొనే



అల్లు అర్జున్, ప్రముఖ సినీ దర్శకుడు అట్లీ కలయికలో ఓ భారీ చిత్రం రూపుదిద్దుకోనున్న సంగతి తెలిసిందే. సైన్స్ ఫిక్షన్ కథాంశంతో తెరకెక్కుతున్న ఈ సినిమాపై ప్రేక్షకుల్లో ఇప్పటికే భారీ అంచనాలు నెలకొన్నాయి. ప్రముఖ బాలీవుడ్ నటి దీపికా పదుకొనే ఈ చిత్రంలో కథానాయికగా నటించనున్నట్లు తాజా సమాచారం. దీపికా పాత్ర ద్వారా కొన్ని భారీ యాక్షన్ సన్నివేశాలను చిత్రీకరించనున్నట్లు తెలుస్తోంది. దీంతో సినిమాపై అంచనాలు మరింతగా పెరిగాయి.

అల్లు అర్జున్ పుట్టినరోజు సందర్భంగా ఈ ప్రాజెక్ట్‌ను అధికారికంగా ప్రకటించిన విషయం విదితమే. హాలీవుడ్ వీఎఫ్ఎక్స్ ఈ సినిమా కోసం ఓ సరికొత్త ప్రపంచాన్ని సృష్టించనున్నారని తెలుస్తోంది.

సైన్స్ ఫిక్షన్, యాక్షన్ ఫాంటసీ అంశాలతో మాస్ ఎలిమెంట్స్‌ను జోడించి ఈ చిత్రాన్ని అట్లీ తెరకెక్కించనున్నారని టాక్. భారతీయ సినిమాలో ఇలాంటి జానర్ కాంబినేషన్‌లో ఇంత భారీ స్థాయిలో ఓ సినిమా రావడం ఇదే ప్రథమం అని చెప్పొచ్చు.

ప్రస్తుతం ప్రీ ప్రొడక్షన్ దశలో ఉన్న ఈ చిత్రం షూటింగ్ ఈ ఏడాది ద్వితీయార్థంలో ప్రారంభం కానున్నట్లు చిత్ర వర్గాల సమాచారం.

'పుష్ప..ది రూల్' సినిమాతో అల్లు అర్జున్ ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు పొందగా.. 'జవాన్' చిత్రంతో అట్లీ బ్లాక్‌బస్టర్ విజయాన్ని అందుకున్నారు. ఇప్పుడు వీరిద్దరి కలయికలో దీపికా పదుకొనే వంటి స్టార్ హీరోయిన్ భాగస్వామ్యంతో, హాలీవుడ్ వీఎఫ్ఎక్స్ నిపుణుల సహకారంతో ఈ సినిమా రానుంది. అత్యంత ఆసక్తిగా ఎదురు చూస్తున్న చిత్రాల్లో ఒకటిగా నిలుస్తుందని సినీ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

## తారాతీరం



# 'తమ్ముడు'లో సప్తమీ గౌడ

కన్నడ నుంచి తెలుగు తెరపైకి ఎంట్రీ ఇచ్చిన కథానాయికలు తమ గ్లామర్, నటనతో ఇక్కడ దూసుకుపోతూనే ఉన్నారు. సీనియర్ నటి సౌందర్య తరువాత కూడా చాలామంది కన్నడ భామలు టాలీవుడ్‌లోకి ఎంట్రీ ఇచ్చారు. టాలెంటుతో పాటు కొంతమందికి అదృష్టం కూడా తోడు కావడంతో తమ జోరును కొనసాగిస్తున్నారు. ఈ మధ్య కాలంలో కన్నడ నుంచి వచ్చిన రష్మిక, ఒక రేంజ్‌లో తన సత్తా చాటుతోంది.

కన్నడ ఇండస్ట్రీ నుంచి కొంత కాలంగా పాన్ ఇండియా సినిమాలు పరిగెడుతున్నాయి. దాంతో ఆయా సినిమాలలోని హీరోయిన్స్‌కి కూడా మిగతా భాషల నుంచి ఆఫర్స్ రావడం మొదలైంది. అలా కన్నడ వైపు నుంచి వచ్చిన 'కేజీఎఫ్' ద్వారా శ్రీనిధి శెట్టి, 'కాంతార' ద్వారా సంయుక్తా మీనన్ ప్రేక్షకులను అలరించారు.

'హిట్ 3' సినిమాతో శ్రీనిధి శెట్టి టాలీవుడ్‌లోకి ఎంట్రీ ఇచ్చింది. తన ఆకర్షణీయమైన రూపం, తపదైన నటనతో ఇక్కడి ప్రేక్షకులను ఆకట్టుకుంది.

ఈ నేపథ్యంలోనే సప్తమీ గౌడ కూడా 'తమ్ముడు' సినిమాతో నితిన్ సరసన మెరవనుంది. 'కాంతార' చిత్రంతో ప్రత్యేక ఆకర్షణగా నిలిచిన ఈ సుందరి, తెలుగు తెరపై ఎప్పుడు కనిపిస్తుందా? అని ఇక్కడి ఫ్యాన్స్ వెయిట్ చేస్తున్నారు. వాళ్ల ముచ్చట 'తమ్ముడు' చిత్రంతో తీరనుంది.

ఆదివారం వార్త

22 జూన్, 2025

## మంచి ముత్యాలు

- వినడం నేర్చుకుంటే అవివేకుల మాటలలో కూడా అనేక యదార్థాలు లభిస్తాయి. - కొల్లిపర పాండురంగారావు
- గొప్ప సత్యాలన్నీ సామాన్యమైనవే. అలాగే గొప్ప వ్యక్తులు కూడా. - ఆగస్టస్ హేర్

## కదంబం

'సంఘీ'భావం....5
పెనుప్రమాదంలో శ్రీశైలం ప్రాజెక్టు

కవర్ స్టోరీ..6
పురుషోత్తమ ధామం
పూరీ జగన్నాథం..

ఈ వారం కవిత్వం...12
అంతరంగం

కథ..20
నాన్న కానవస్తున్నాడు

సాహిత్యం.. 23
ప్రాచీన ఆంధ్ర భాషా ప్రశంస

సమయ పాలన అవసరం.. 26

అరుదైన కోడి 'ఒనగడోరి'..28

ఇంకా...
మొగ్గ
వారఫలం
వంటలు
వగైరా.. వగైరా..

# సమాచారం

## దారి కనుక్కోవడం కష్టమే!

ప్రపంచంలోనే అత్యంత పొడవైన తోట(మేజ్)గా గుర్తింపు పొందింది లండన్‌లోని 'లాంగ్లీట్ హెడ్జ్ మేజ్'. ఈ తోట లండన్‌లోని హార్మింగ్‌షామ్ గ్రామ శివార్లలో ఉంది. ఇందులోకి వెళ్లిన తరువాత బయటకు రావడం అంత సులభం కాదు. ఏ బాట ఎటు వైపు వెళ్తుందో తెలుసుకోవటం కష్టం. ఈ తోటలోకి అడుగు పెడితే కనీసం రెండు గంటలు పడుతుందట.

ఈ మేజ్ ఒకటిన్నర ఎకరాలలో సుమారు మూడు కిలో మీటర్లు విస్తరించి ఉంది. ఈ మేజ్‌ను రూపొందించే క్రమంలో పదహారు వేల గుబురు పొదలు నాటినట్లు తెలుస్తోంది. ఈ మేజ్‌లో నడుస్తుంటే మన పక్కన ఏమీ కనిపించదు. ఒక్కో పొద ఎనిమిది అడుగుల ఎత్తు ఉంటుంది. తొందరగా వెళ్లాలని వేగంగా నడుస్తూ వెళ్తే డెడ్ ఎండ్ కనిపిస్తుంది. ఇంకేం చేస్తాం.. రూట్ మార్చుకుని తిరిగి మళ్లీ నడక మొదలు పెట్టాల్సిందే!

ఈ మేజ్‌లో ఆరు చోట్ల వంతెనలు ఉన్నాయి. ఏ వైపు వెళ్లాలన్న సందేహం వచ్చినప్పుడు వంతెన పైకి ఎక్కి చూస్తే మనం ఎక్కడ వున్నామో తెలుస్తుంది. చిన్నారులు పెద్దవాళ్లను తోడు తీసుకుని వెళ్లడం అత్యుత్తమం. ఇందులో అక్కడక్కడ ఎమర్జెన్సీ బ్యాకప్ స్విచ్‌లను ఏర్పాటు చేసారు. బయటకు వచ్చే దారి తెలియనప్పుడు ఈ బటన్ నొక్కితే అవసరమైన సహాయం లభిస్తుంది. పర్యాటక ప్రాంతంగా గుర్తింపు పొందిందీ మేజ్.

అయితే ఇటీవల కాలంలో స్మార్ట్ ఫోన్‌ల సహాయంతో లొకేషన్ చూస్తూ సులభవంగా పర్యాటకులు బయటకు వచ్చేస్తున్నారట. అయితే అలా చేయటం వల్ల ఎలాంటి అనుభూతి లభించదు.



కనుక మేజ్‌లోకి ప్రవేశించేటప్పుడు ఫోన్‌లు తీసుకువెళ్లకపోవటమే మంచిది.

సో.. అలా చేస్తే మేజ్ చూసిన అనుభూతి సొంతం చేసుకోవచ్చు.

మీ రచనల్ని ఈ మెయిల్ చిరునామాకు పంపగలరు.
sunmagvaartha@gmail.com











వర్షాకాలం ప్రారంభమైంది. సో.. చిన్నారుల స్కూల్ బ్యాగ్‌లో గొడుగు తప్పనిసరిగా చేర్చాలి. పిల్లలు, పెద్దవాళ్ల కోసం మార్కెట్‌లో విభిన్నమైన డిజైన్స్‌తో ఆకర్షణీయమైన గొడుగులు లభిస్తున్నాయి.







# 'సంఘీ' భావం



# పెనుప్రమాదంలో శ్రీశైలం ప్రాజెక్ట్

ఉభయ తెలుగు రాష్ట్రాలకు ఉమ్మడి ప్రాజెక్ట్ శ్రీశైలం ప్రస్తుతం పెనుప్రమాదంలో ఉంది. డ్యామ్ పునాదుల కింద భూగర్భంలో భారీ రాతిఫలకాల మధ్య పెళుసుతో కూడిన అతుకులు ఉన్నట్లు జియాలాజికల్ శాస్త్రవేత్తలు గుర్తించారు. ఇదే విషయాన్ని జాతీయ ఆనకట్టల భద్రత సంస్థ (ఎన్‌డీఎస్ఏ) నిపుణుల కమిటీ ఏడాది క్రితమే తేల్చింది. జలాశయం కింద భూగర్భంలోని రాతిఫలకాల మధ్య అతుకులున్నాయని, అనుబంధ జాయింట్ల మధ్య దూరం పెరిగితే డ్యామ్ పునాదులు రక్షణను కోల్పోయే ప్రమాదం ఉందని అంచనా వేసింది. డ్యామ్ దిగువన ఏర్పడిన భారీ గొయ్యి 120 మీటర్ల లోతు ఉందని, డ్యామ్ పునాదుల కన్నా కిందకు ఆ గుంత విస్తరించి ఉండే అవకాశం ఉందని పేర్కొంది. జలాశయం భద్రత దృష్ట్యా తక్షణమే తగిన అధ్యయనాలు చేసి, మరమ్మతులకు ఉపక్రమించాలని సిఫారసు చేసింది. శ్రీశైలం జలాశయం దిగువన డైక్/కాఫర్ డ్యామ్ ఏర్పాటుకు సాధ్యాసాధ్యాలను పరిశీలించాల్సి ఉంటుంది. భారీ గొయ్యికి రెండు వైపులా రాతిఫలకాలకు బోల్టులు అమర్చి కాంక్రీట్‌తో రీఎన్‌ఫోర్స్ చేయాలని నివేదికలు రూపొందించారు. గొయ్యి పరిమాణం మరింత పెరగకుండా జలాశయం గేట్ల నిర్వహణలో మార్పులు చేయాల్సిన అవసరం ఉందని సిఫారసులు చేశారు. ఎగువన ఎడమ గట్టుకు రక్షణగా నిర్మించిన గోడ, పియర్, స్పిల్‌వే ఎగువ భాగానికి మరమ్మతు చేపట్టకపోతే ప్రమాదం జరిగే అవకాశం ఉందని హెచ్చరికలు జారీ చేశారు. 17/18 బ్లాకులకు రెండో చోట్ల అడ్డంగా వచ్చిన పగుళ్లకు మరమ్మతు చేయాల్సి ఉంది. డ్యామ్ దిగువన 4, 9,10 నంబర్ల గేట్ల వద్ద ఏర్పడిన గుంతల లోతును అధ్యయనం చేసి, దాని ఆధారంగా మరమ్మతులను నిర్వహించాలి. 16,17వ బ్లాకుల వద్ద ఏర్పాటు చేసిన రివర్స్ స్లూయిసల నుంచి లీకేజీని అరికట్టడానికి అత్యంత ప్రాధాన్యతతో మరమ్మతులు చేపట్టాలని సూచించారు. డ్యామ్ ఫౌండేషన్ గ్యాలరీలో ఆందోళనకర రీతిలో సీపేజీ జరుగుతోందని, డ్యామ్ బ్లాకులను 45 భాగాలుగా విభజించి సీపేజీని అంచనా వేయాలని నిపుణులు చెబుతున్నారు. సీపేజీ అధికంగా ఉన్న బ్లాకులకి కర్టెన్ గ్రౌటింగ్ చేయాల్సిన అవసరం ఉంది. డ్రెయిన్ రంధ్రాల నుంచి పూడిక తొలగించి సీపేజీ నీళ్లు బయటకి వెళ్లే ఏర్పాట్లు చేయాలి. పూడిక తొలగింపు సాధ్యం కాని పక్షంలో అత్యంత జాగ్రత్తగా కొత్త రంధ్రాలు వేయాల్సి ఉంటుందని నిపుణులు పేర్కొంటున్నారు. భూకంపాల ముప్పు, ప్రాజెక్టుకు వచ్చే వరదపై మళ్లీ అధ్యయనాలు చేపట్టాల్సి ఉంటుంది. కాగా శ్రీశైలం ప్రాజెక్టు మరమ్మతు పనులను వెంటనే చేపట్టాలని నెలాఖరులోగా పూర్తి చేయాలని ఏపీ ప్రభుత్వాన్ని జాతీయ ఆనకట్టల భద్రత సంస్థ(ఎన్‌డీఎస్ఏ)ఆదేశించింది. దీనితో ప్రత్యేక నిపుణుల బృందం తాజా మరోసారి డ్యాం పరిస్థితులను అంచనా వేశారు. మరమ్మత్తులు వెంటనే చేపట్టకపోతే భారీ నష్టం కలిగే ప్రమాదం ఉంది. శ్రీశైలం ప్రాజెక్ట్ నిర్మాణం 1963లో ప్రారంభమై 1984 నాటికి పూర్తి చేసుకుని వినియోగంలోకి వచ్చింది. 1975 -76లో జలాశయం దిగువన బకెట్ ఏరియాలో కోతకు గురైనట్లు గుర్తించి నిపుణుల కమిటీ సూచన మేరకు రక్షణగా అప్రాన్ ఏర్పాటు చేసినా ఆశించిన ఫలితం కనిపించలేదు. శ్రీశైలం జలాశయాన్ని గరిష్టంగా 19 లక్షల క్యూసెక్కుల వరదను తట్టుకునేలా నిర్మించగా 2009లో భారీగా వరదలు డ్యామ్‌ను తాకాయి. సుమారు 25.5 లక్షల క్యూసెక్కుల వరద నీరు జలాశయానికి పోటెత్తింది. గరిష్ట నీటిమట్టం 271.8 మీటర్లు కాగా, వరదల సమయంలో 273.25 మీటర్లకు పెరిగిపోవడంతో జలాశయం పొంగిపొర్లింది. 78 గంటల పాటు భీకర వరద కొనసాగడంతో జలశయానికి తీవ్ర నష్టం వాటిల్లింది. గంత కారణంగా జలాశయం పునాదుల కింద రాతిపొరల్లో వచ్చిన మార్పులను అధ్యయనం చేయడానికి ఆధునిక పద్ధతుల్లో సిమ్యూలేషన్ అధ్యయనాలు చేయాలి. వేర్వేరు వరద తీవ్రతలను ప్రామాణికంగా తీసుకుని జలాశయానికి ఉండే ముప్పును, స్థిరత్వాన్ని, జారిపోయే ప్రమాదాలను నివారించాల్సి ఉంటుంది.

శ్రీశైలం దిగువన మరో పెద్ద బహుళార్థసాధక నీటిపారుదల ప్రాజెక్టు నాగార్జునసాగర్ ఉంది. శ్రీశైలం వద్ద విపత్తు సంభవించినప్పుడు ప్రభావితమయ్యే అనేక పట్టణ సముదాయాలతో పాటు కృష్ణ నది ఒడ్డున వందలాది గ్రామాలు ఉన్నాయి. ఆంధ్రప్రదేశ్ తన కొత్త రాజధాని అమరావతి స్థలంలో భారీగా పెట్టుబడులు పెడుతోంది. స్పష్టంగా, కేంద్ర జల వనరుల మంత్రిత్వ శాఖ లేదా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం శ్రీశైలంలో రాబోయే విపత్తు వల్ల భారీ నష్టం సంభవించే ప్రమాదం ఉంది. శ్రీశైలం డ్యామ్‌కు ఏదైనా ముప్పు వాటిల్లితే దిగువన ఉన్న ప్రాంతాల ప్రజలకు రక్షణ కల్పించేందుకు వీలుగా అత్యవసర కార్యాచరణ ప్రణాళికలను సిద్ధం చేసుకోవాల్సి ఉంటుంది. డ్యామ్ ఫౌండేషన్ గ్యాలరీలో ఆందోళనకర రీతిలో పెద్ద మొత్తంలో సీపేజీ జరుగుతోందని, వీటిని అరికట్టడానికి వెంటనే చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.

కేంద్ర ప్రభుత్వం కూడా ఈ అంశంపై దృష్టి సారించింది. కేంద్రం నుంచి నిధులు మంజూరు చేయాల్సి ఉంది. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు వెంటనే శ్రీశైలం ప్రాజెక్ట్‌ను సంరక్షించేందుకు ప్రణాళికలు సిద్ధం చేయాల్సిన అవసరం ఉంది.

- డాక్టర్ గిరీష్‌కుమార్ సంఘీ

కవర్‌స్టోరీ

ఇలపావులూరి వెంకటేశ్వర్లు

# పురుషోత్తమ ధామం పూరీ జగన్నాథం..

మన దేశం భిన్న సంస్కృతులకు భిన్న సంప్రదాయాలకు నిలయం. మన భాష, వస్త్రధారణ, ఆహారపు అలవాట్లు వేరువేరుగా ఉంటాయి. భగవంతుని ఆరాధించడంలో కూడా అదే కనపడుతుంది. చరాచర సృష్టికర్త, ఆద్యంతాలు లేని నిరాకారుడైన సర్వాంతర్యామికి వివిధ ప్రాంతాలలో ఆలయాలను నిర్మించి పూజించడం ఎన్నో వందల సంవత్సరాలుగా జరుగుతున్నదని పురాణ గ్రంథాలు తెలుపుతున్నాయి. ప్రతి ఒక్క ఆలయం తనదైన ప్రత్యేకతలు కలిగి ఉంటుంది. అవి ఆలయ నిర్మాణం, క్షేత్ర ప్రాధాన్యం, వెలిసిన దేవర రూపం, అక్కడ జరిగే ఉత్సవాలు అవే పురాణాలు పేర్కొంటున్నాయి. ప్రస్తుత కలియుగంలో మాత్రం విగ్రహారాధనకు అగ్రస్థానం అందించారు. దానికి కారణాలు అనేకం.

ఇవన్నీ కలబోసి మరికొన్ని జత చేసి చూస్తే కనిపించే క్షేత్రం పూరీజగన్నాథ్.

## క్షేత్ర గాథ

ఋగ్వేదం, మత్స్య, బ్రహ్మ, నారద పద్మ, స్కంద కపిల పురాణాలలో పూరీ క్షేత్ర ప్రస్థాపన ఉన్నది. ఋగ్వేదంలో "పురుష మందాన" అని పేర్కొనబడినట్లుగా తెలుస్తోంది. పురుష మందాన కాలక్రమంలో 'పురుషోత్తమ పురి'గా మారి ఇప్పుడు 'పూరీ' అని పిలవబడుతోంది. పురుషుడే పురుషోత్తముడయ్యారు ఆయనే జగన్నాథుడు. తొట్టతొలి ఆలయం ఎవరు నిర్మించారన్నదానికి స్పష్టమైన ఆధారాలు లేకపోయినా పదకొండవ శతాబ్దంలో తూర్పు గంగ వంశం రాజులు ప్రస్తుత ఆలయాన్ని నిర్మించారని చరిత్రకారుల ఏకాభిప్రాయం. అగ్రజుడు, సోదరితో శ్రీ జగన్నాథుడు నీలాచలం అనే పర్వతం మీద కొలువు తీరిన పూరీ మందిరం ఇంద్రద్యుమ్నుడు అనే రాజు నిర్మించినట్లు తెలుస్తోంది.



## బ్రహ్మ విరచిత గాథ

యుగాల క్రితం సర్వలోక రక్షకుడు అయిన శ్రీహరి సాగర తీరాన జగన్నాథుడు నీల మాధవునిగా కొలువై ఉండేవారట. దివ్యకాంతులు వెదజల్లే ఆ అర్చనామూర్తి దర్శనంతోనే సకల పాపాలు తొలగిపోయేవి, నరకం వెళ్లే వారు తగ్గిపోయారట. ఆందోళన చెందిన యమధర్మరాజు పరమశివుని ప్రార్థించి ఆ దివ్య మంగళ రూపాన్ని భూస్థాపితం చేశారట. ఆనతి కాలంలోనే అక్కడ ఒక పర్వతం ఏర్పడింది.. అదే నీలాచలం చేసిన వాగ్దానం భంగం చేయడం వలన దేవశిల్పి విశ్వకర్మ విగ్రహాలను అసంపూర్ణంగా వదిలి వేశారు. అభయ, వరద హస్తాలు లేవు కనుక భక్తులు మాత్రమే దర్శన మాత్రాన ముక్తిని పొందుతారని అంటారు. ఈ నీలాద్రి పర్వతం ఉన్న ఈ పురుషోత్తమ పూరీ మహిమాన్విత క్షేత్రంగా భక్తులకు ఇహ, పర సుఖాలను ప్రసాదిస్తుంది. ఈ మూడు రూపాలు పరమాత్మ అయిన వాసుదేవునికి, ఆయన వ్యూహ రూపమైన సంఘర్షణ (బలదేవుడు), ఆయన యోగమాయ అయిన సుభద్ర నాలుగవది సుదర్శన చక్రం. శ్రీవారి వైభవానికి చిహ్నాలు, అని విగ్రహాల రూప విశేషాల గురించి వివరించారట విరించి. క్షేత్ర మహాత్మ్యాన్ని వివరించిన తరువాత విధాత స్వయంగా విగ్రహ ప్రతిష్ట చేశారట. అలా హంసవాహనుని చేతుల మీదుగా ద్వాపర యుగ తొలినాళ్లలో పురుషోత్తమ పురి శంఖుస్థాపన జరిగినట్లుగా క్షేత్రగాథ తెలుపుతోంది.

## ఆలయ నిర్మాణ శైలి

భారతదేశంలో ముఖ్యంగా నాలుగు రకాల ఆలయ నిర్మాణాలు కనిపిస్తాయి. అవి నగర, వాసర, ద్రవిడ, గదగ్. కానీ ఉత్కళ దేశ ఆలయ నిర్మాణాలు కొంత వరకు నగర శైలిలో నిర్మించబడినా పూర్తిగా కాదు. అందుకే ఉత్కళ శైలి అని పిలుస్తారు. ఇందులో కూడా ఒక ఆలయం నుండి మరో ఆలయానికి కొంత నిర్మాణ వత్యాసం కనిపించడం ప్రత్యేకం.

## ఆలయ విశేషాలు

పేరుకి శ్రీ జగన్నాథ క్షేత్రం అయినా వినాయకుడు, దుర్గ, శ్రీ మహాలక్ష్మి, సరస్వతి, పార్వతి, శక్తి, సతీదేవి కొలువైన ఏకైక క్షేత్రం. ఈ ఆలయంలో ప్రధాన దైవాలైన శ్రీ జగన్నాథ, శ్రీ బలభద్ర, శ్రీ సుభద్రలు ప్రధాన ఆలయంలో రత్నవేదిక (రత్న భేది) పైన దర్శనమిస్తారు. పూర్తిగా ఉత్కళ నిర్మాణ శైలిని ప్రదర్శించే సుందర నిర్మాణమైన ఈ ఆలయంలో అనేక ఇతర దేవీ దేవతల సన్నిధులతో పాటు ఆలయ పాకశాల, నబకళేబర దహనశాల ఉంటాయి. ఆలయం చుట్టూ ఎత్తైన ప్రాకారం నిర్మించబడింది. నాలుగు దిక్కులా ద్వారాలు నిర్మించారు.

ప్రధాన ద్వారాన్ని సింహ ద్వారం అని అంటారు. మిగిలిన మూడు దిక్కుల ఉన్న హతీ అశ్వ, వ్యాఘ్ర ద్వారాలు అని పిలుస్తారు. మధ్యలో రెండు వందల అడుగుల ఎత్తైన విమాన గోపురంతో ఎదురుగా ఇంకా ఎత్తైన రాతి ధ్వజస్థంభం కనపడతాయి. తూర్పు ముఖంగా ఉన్న ఆలయానికి వెలుపల ప్రధాన ద్వారానికి వెలువల పదహారు ముఖాల ఏక శిలా నిర్మితమైన అరుణ స్థంభం కనపడుతుంది.

పైన సూర్యదేవుని రథసారథి అయిన అరుణుడు ఉపస్థితులై ఉంటారు. సింహ ద్వారం నుండి ప్రాంగణం లోపలికి ప్రవేశించగానే ఎత్తైన మెట్ల మార్గం ఆలయానికి చేరుస్తుంది.

ఈ మెట్లకు విశేష ప్రాధాన్యత ఉందని విశ్వసిస్తారు భక్తులు. ఒక్కో మెట్టు డెబ్బై అడుగుల వెడల్పు ఉంటాయి. ఇరవై రెండు మెట్లు మానవులకు గల చెడు లక్షణాలు అయిన అహంకారం, అసూయ. లోభం, మోసం, మోహం, క్రోధం లాంటి వాటికి ప్రతీకగా పేర్కొంటారు. రథయాత్ర సమయంలో మూలమూర్తులు ఈ మార్గం గుండానే రథాలను చేరుతారు. జగన్నాథ దర్శనఫలం దక్కాలి అంటే దుర్వ్యసనాలను వదిలి కన్నవారిని, తోడపుట్టిన వారిని ఆదరించాలి అన్న జీవిత సత్యాన్ని ఈ మెట్లు తెలుపుతాయి.

ఈ ప్రాంగణంలో సుమారు వందకు పైగా ఉపాలయాలు ఉంటాయి. వీటిలో ప్రధానమైనవి శ్రీ కంచి గణేష్, శ్రీ సూర్య, శ్రీ మహాలక్ష్మి. శ్రీ నరసింహ, శ్రీరామ, శ్రీ హనుమ, శ్రీ విమల, శ్రీ శనేశ్వర సన్నిధులు ముఖ్యమైనవి. గజపతి పురుషోత్తమ దేవ కంచి రాజకుమారిని వివాహం చేసుకొన్న సందర్భంలో కంచిరాజు అల్లునికి గణపతి విగ్రహాన్ని బహుకరించారట. శ్రీ నరసింహస్వామిని ఇంద్రద్యుమ్న రాజు ద్వాపర యుగంలో ప్రతిష్ఠించారు.

మహాశక్తి పీఠం దక్షవాటికలో జరిగిన అవమానానికి యజ్ఞ గుండంలో తనువు దాలించిన సతీదేవి శరీరాన్ని శ్రీ మహా విష్ణువు సుదర్శన చక్రంతో ఛేదించారు. ఆ శరీర ఖండాలు పడిన ప్రదేశాలు శక్తి పీఠాలుగా ప్రసిద్ధికెక్కాయి. శ్రీ జగన్నాథ మందిరంలో ఉన్న శ్రీ విమలాదేవి కొలువైన ప్రదేశంలో సతీదేవి పాద భాగాలూ పడటం వలన ఈ సన్నిధి మహా శక్తి పీఠంగా విరాజిల్లుతోంది. అమ్మవారు శాంత ప్రసన్న వదనంతో దర్శనమిస్తారు. అశ్వీజ మాసంలో మహాలయ ప్రారంభానికి ఎనిమిది రోజుల ముందు విశేష పూజలు చేస్తారు. విజయదశమి ముగిసిన తరువాత జరిగే షోడశ దినాత్మక అని పిలిచే పదహారు రోజుల పండుగ శ్రీ విమలాదేవి సన్నిధిలో జరిగే మరో ప్రత్యేక ఉత్సవం. శ్రీ జగన్నాథ ఆలయ ప్రాంగణంలో వివిధ సాంస్కృతిక సమావేశాల కోసం ఆలయ ఉత్సవాలు నిర్వహించడానికి అనేక మండపాలు నిర్మించారు. ఇవన్నీ చక్కని స్తంభాలతో ఎత్తైన గద్దెతో నిర్మించబడ్డాయి.

## రత్నబేది

జగన్మోహన, నాట్య మండపం, భోగమండపం దాటి వెళితే వచ్చే గర్భాలయంలో 'రత్న బేది'గా పిలవబడే ఎత్తైన గద్దె మీద శ్రీ జగన్నాథ. శ్రీ బలభద్ర, అన్నల మధ్య సుభద్ర వర్ణనాతీతమైన అలంకరణలో నేత్రపర్వంగా దర్శనమిస్తారు.





ప్రధాన అర్చనమూర్తులతో పాటు విశ్వకర్మ తయారు చేసిన దారు సుదర్శన చక్రం శ్రీ మదన మోహన శ్రీదేవి శ్రీ విశ్వధాత్రి కొలువై ఉంటారు.

## మహాలక్ష్మి ఆధ్వర్యంలో శ్రీవారి నివేదన

ఈ ఆలయంలో మరో విశేష ప్రదేశం పాకశాల. జగన్నాయకుడు కొలువైన పూరీ సందర్శన మనోభీష్టాలను నెరవేర్చేది. స్వామివారి అన్నప్రసాద సేవన సర్వ పాపహరణం. 'మేఘానంద ప్రాకారం' లో ఉన్న రసోయి ఘరో'(పాకశాల)లో నవనీత చోరుని నివేదన నిమిత్తం నవకాయ పిండి వంటలు మందిరరాణి శ్రీ మహాలక్ష్మి ఆధ్వర్యంలో జరుగుతాయి. రోజులో అయిదు సార్లు మూలవిరాట్టులకు, పరివార దేవతలకు నివేదనలు పెడతారు. వాటిలో మధ్యాహ్నం 'కోతో భోగో లేదా అబద' ముఖ్యమైనది. అన్నం. కూరలు, పప్పు, పచ్చడి, పాయసం లాంటివి ఈ నివేదనలో ఉంటాయి. మహాప్రసాదంగా పిలవబడే ఈ నివేదనలో సమర్పించే యాభై ఆరు రకాల వంటలను ప్రాంగణంలో వున్న గంగ, జమున అని పిలిచే పవిత్ర బావుల నీటితో తయారు చేస్తారు. ఈ కార్యక్రమం ప్రపంచంలోనే మరెక్కడా చూడని విధానంలో ఉంటుంది. ఏడు కుండలను ఒకదాని మీద ఒకటి పేర్చి పొయ్యి పైన ఉంచుతారు. చిత్రంగా అన్నిటికన్నా పైన ఉన్న చిన్న కుండలోని పదార్థాలు ఉడుకుతాయి. చివరగా అన్నిటికన్నా కింద ఉన్న పెద్ద కుండలోని పదార్థాలు ఉడుకుతాయి. వంటలో ఏ విధమైన అపవిత్రత తొంగిచూసినా వంటశాల వెలుపల కుక్క తాలూకు నీడ కనపడుతుందట. దాంతో శ్రీ మహాలక్ష్మి ఆగ్రహం చెందిందని భావించి వండిన పదార్థాలను భూస్థాపితం చేసి తిరిగి వంట చేస్తారు.

ఆలయ పండాలు వంటకాలను కావడిలో పెట్టుకొని ప్రత్యేక మార్గంలో భోగ మండపం చేరుస్తారు. నివేదన తరువాత అధిక శాతం మహాప్రసాదాన్ని ఆలయ ఈశాన్య భాగంలో ఉన్న 'ఆనంద బజార్' కి పంపుతారు. అక్కడ ప్రజలు మహాప్రసాదాన్ని మహదానందంతో కొనుగోలు చేస్తారు. ఈ ప్రసాద పంపిణీలో ఎలాంటి నిబంధనలు ఉండవు. అందుకే సర్వం జగన్నాథం అంటారు. వండిన మహా ప్రసాదం ఏ రోజు కూడా మిగలక పోవడం మరింత ప్రత్యేకం.

శ్రీ జగన్నాథుడు కొలువైన శ్రీమందిరం అనేక ప్రత్యేకతలు, విశేషాలకు కేంద్రం. ఆలయ విమాన శిఖరాన కనిపించే అష్ట ధాతువులతో చేసిన వెయ్యి కిలోల బరువు ఉండే 'నీల చక్ర' (సుదర్శన చక్రం) ఆ రోజులలో అంత పైకి ఎలా చేర్చారన్నది ఆశ్చర్యం కలిగిస్తుంది.

మనం ఏ దిక్కు నుండి చూస్తే సుదర్శన చక్రం ఆ వైపు తిరిగి ఉన్నట్లు కనిపిస్తుంది. ఆలయ విమాన గోపురం పైన కట్టిన జెండాను ఒక పండా ఎలాంటి రక్షణ లేకుండా చేతులతో ఎక్కి మార్చడం మరో విశేషం. అలా మార్చకపోతే పద్దెనిమిది సంవత్సరాలు ఆలయం మూతపడుతుందని ఆలయ మదాల పంజిలో పేర్కొన్నట్లుగా చెబుతారు.

శ్రీ మందిరం పైన విమానాలు కాదు కదా పక్షులు కూడా ఎగరవు, ఆలయ నీడ ఏ సమయంలో కూడా కనపడదు. అదే విధంగా ఆలయంలో సముద్ర ఘోష వినపడదు. వీటన్నింటి కన్నా ముఖ్యమైన విశేషాలు మరో రెండు ఉన్నాయి. అవి నవకళేబర, రథయాత్ర. మరే ఇతర క్షేత్రంలో కనపడనివి ఇన్ని వందల సంవత్సరాల తరువాత ఇవన్నీ ఎలా సాధ్యం? తరాలు మారినా ఆచారాలు విధానాలు పద్ధతులు మారక పోవడానికి కారణం 'మదాల పంజి'.

## మదాల పంజి

ఆలయ సంఘటనల సంకలన పుస్తకం అని చెప్పవచ్చు. గంగ వంశ రాజులా పాలనా కాలంలో మదాల పంజిని భవిష్యత్తరాల వారి కోసం ఏర్పాటు చేసారని శాసనాల ద్వారా తెలుస్తోంది. నాటి పాలకులు ముందు తరాల వారికి ఆలయ నిర్వహణ గురించిన సమగ్ర సమాచారం అందించడానికి ఆలయ చరిత్రలోని ముఖ్య ఘట్టాల వివరాలు తెలుపడానికి ఎంచుకొన్న మార్గం. ప్రతి విజయదశమికి ఆ సంవత్సరంలో జరిగిన ముఖ్య సంఘటనలను ఇందులో రాస్తారు. మదాల పంజిలో రాయడానికి, తప్పొప్పులు సరిచేయడానికి అనుసరించడానికి, వివరించడానికి, భద్రపరచడానికి అయిదుగురు 'కరణాలు' నియమించబడ్డారు. దీనిలో నాలుగు భాగాలు ఉంటాయి. రాజ ఖంజ, రాజ్య ఖంజ, కర్మాంగి, దిన పంజి. ఈ నాలుగు భాగాల ద్వారా నేటికీ ఆలయంలో అన్ని పురాతన సంప్రదాయాలను అనుసరించడం జరుగుతోందనుకోవచ్చు.



## ఆలయ ఉత్సవాలు

శ్రీ జగన్నాథ మందిరం ఎన్నో ప్రత్యేక విశేష ఉత్సవాల కేంద్రం. నిత్య పూజలతో పాటు నెలకొక ఉత్సవం జరుగుతుంది. బ్రహ్మ దేవుడు ప్రతిష్టించిన ఆలయంలో ఆయన నిర్ణయించిన మేరకు సంవత్సరంలో పన్నెండు ఉత్సవాలు సంప్రదాయబద్ధంగా నిర్వహిస్తారని స్కంద పురాణం ద్వారా తెలుస్తోంది. స్నాన యాత్ర, రథ యాత్ర, శయన యాత్ర, ఉత్తరాయణ, దక్షిణాయన. పార్శ్వ పరివర్తన, ఉత్థాపన, ప్రవరణ పుష్యాభిషేక, డోలా యాత్ర, దమనక భజన, అక్షయ తృతీయ, చందన యాత్ర, నీలాద్రి మహోదయ, నవకళేబర ఇవి కాకుండా మరెన్నో చిన్న చిన్న ఉత్సవాలు జరుపుతారు.

## నవ కళేబర

ఏ దేవాలయంలో అయినా ఒకసారి ప్రతిష్ఠించిన అర్చనా మూర్తిని మార్చడం జరగదు. అరుదైన పరిస్థితులలో మాత్రమే అలాంటిది చోటు చేసుకొంటుంది. కానీ అనేక విశేషాల నిలయమైన శ్రీ జగన్నాథ మందిరంలో పన్నెండు నుండి పద్దెనిమిది సంవత్సరాలకు ఒకసారి అధిక ఆషాడ మాసం వచ్చిన సంవత్సరం 'నవ కళేబర' పేరుతో ఈ మార్పు జరుగుతుంది. శ్రీ జగన్నాథ. శ్రీ బలభద్ర, శ్రీ సుభద్ర మూర్తులు దారు శిల్పాలు అనగా వేపచెట్టు కాండంతో తయారు చేసినవి. ఈ ఆచారం రావడానికి ప్రధాన కారణం యుద్ధాలు ఏడవ శతాబ్దంలో రాష్ట్రకూట రాజులు చేసిన దాడి మొట్టమొదటిదిగా ఆలయ పంజి తెలుపుతోంది. అది మొదలు ఎన్నో దాడులు పూరి ఆలయం మీద జరిగాయి. ఎంతో సంపద దోచుకోవడం జరిగింది. ఆంగ్లేయులు ఓఢ్ర దేశాన్ని తమ ఆధీనంలోనికి తీసుకున్నాక ఈ దాడులు ఆగిపోయాయి. వారు స్థానిక ప్రజల భక్తి విశ్వాసాలను అర్థం చేసుకొని ఆలయ వ్యవహారాలు నిర్వహించడానికి స్థానిక హిందూ వ్యక్తిని నియమించారు. దాడులు జరిగినప్పుడు విగ్రహాలను రహస్య ప్రదేశాలకు తరలించడం జరిగేది. వాతావరణ పరిస్థితులు అనుకూలించిన తరువాత అర్చనమూర్తులను రత్న బేది పైన తిరిగి ప్రతిష్టించడం చేసేవారు. ఈ క్రమంలో విగ్రహాలకు నష్టం జరిగేది ఈ కారణంగా విగ్రహాలను మార్చడం అనివార్యం కావడంతో 'నవ కళేబర యాత్ర'ను ప్రవేశపెట్టారని చరిత్రకారుల అభిప్రాయం. సబరుల సంతతికి చెందిన దైతపతుల ఆధ్వర్యంలో నియమించబడిన బృందం నిర్ణయించిన విధానం మేరకు పూజాదులు నిర్వహించి తగిన వృక్షాల కోసం అన్వేషణ చేస్తారు. ఎంచుకొన్న వృక్షానికి పూజలు చేసి ఆలయానికి తరలిస్తారు. అనేక సంప్రోక్షణల తరువాత నిపుణులైన శిల్పులు విగ్రహాలుగా మలుస్తారు. రథయాత్రకు తయారు చేసే రథాల కలపను ఎలాంటి ప్రక్రియ అనుసరిస్తారో అదేవిధంగా ఈ నవకళేబరకు కూడా అనుసరిస్తారు. పాత విగ్రహాలను ప్రత్యేక మరుభూమిలో పాతి పెడతారు.

## బ్రహ్మ పరివర్తన వేడుక

పాత విగ్రహాల నుండి సేకరించిన బ్రహ్మ పదార్థాన్ని నూతన దారు విగ్రహాల లోనికి మార్చే ప్రక్రియను 'బ్రహ్మ పరివర్తన వేడుక' అంటారు. తొలగించిన విగ్రహాల నుండి సేకరించిన బ్రహ్మ పదార్థాన్ని కండ్లకు గంతలు కట్టుకొన్న ప్రధాన అర్చక పండా నిర్వహిస్తారు. తాను తన హస్తాల ద్వారా మార్చే బ్రహ్మ పదార్థం ఏమిటన్నది ఆయనకు కూడా తెలియక పోవడం దైవశక్తికి నిదర్శంగా పేర్కొంటారు. బ్రహ పదార్థ మార్పిడి తరువాతనే నూతన విగ్రహాలు పూజార్హమవుతాయి. రత్న బేది పైన కొలువైన నూతన అర్చనామూర్తుల దర్శనాన్ని 'నాగార్జున బేష' అని పిలుస్తారు.

మనందరికీ తెలిసి చతందన యాత్ర సింహాచలంలో కొలువు తీరిన శ్రీ వరాహ లక్ష్మీ నరసింహా స్వామికి జరుపుతారు. సంవత్సరం అంతా చందన కప్పుతో ఉండే సింహాచలేశ్వరునికి అక్షయ తృతీయ నాడు తొలగించి, భక్తులకు శ్రీవారి నిజరూప సందర్శనానుగ్రహం కలిగిస్తారు. తిరిగి అంచెలు అంచెలుగా స్వామివారిని చందనంతో కప్పడం చేస్తారు.

అదే అక్షయ తృతీయ నాడు పూరిలో కొలువైన శ్రీ జగన్నాథ స్వామికి చందనాభిషేకం చేయడాన్ని 'చందన యాత్ర' అని పిలుస్తారు. నలభై రెండు రోజుల పాటు జరిగే సుదీర్ఘ ఉత్సవం చందన యాత్ర.

## అక్షయ తృతీయ

అక్షయ తృతీయనాడు ఏ శుభకార్యం మొదలు పెట్టినా అది అక్షయంగా మారుతుంది. శుభ ఫలితాలను పొందవచ్చని విశ్వాసం. ఈ నమ్మకానికి మూలం ఆ రోజునే చిన్ననాటి మిత్రుడు కుచేలుని నుండి గుప్పెడు అటుకులు స్వీకరించి అంతులేని సంపదను అనుగ్రహించారు శ్రీకృష్ణ పరమాత్మ. దశావతారాలలోని శ్రీ పరశురామ, శ్రీ బలరాములు జన్మించినది అక్షయ తృతీయనాడే! మహాభారత రచనను శ్రీ వ్యాస భగవానులు పరమ పవిత్రమైన అక్షయ తృతీయ రోజునే ప్రారంభించారు. అన్ని వైష్ణవ ఆలయాలలో అక్షయ తృతీయనాడు శ్రీ లక్ష్మీ నారాయణులకు ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు.

## బాహార యాత్ర



చందన యాత్ర రెండు భాగాలుగా జరుపుతారు. బాహార, బిత్తర (లోపల)యాత్ర. బాహార యాత్రను ప్రజలందరి సమక్షంలో ప్రతి నిత్యం సాయం సంధ్యా సమయంలో నరేంద్ర సరోవరంలో నిర్వహిస్తారు. ముందురోజు భక్తిశ్రద్ధలతో గంధపు చెక్కల నుండి చందనాన్ని తయారు చేస్తారు. మరునాడు ఉదయపు ఆరగింపు తరువాత ప్రధాన అర్చక పండా చందన పాత్రతో రత్న బేది చుట్టూ మూడు సార్లు ప్రదక్షిణ చేసి ఆప్యాయంగా చందనాన్ని విగ్రహ శరీర భాగాలకు లేపనం చేస్తారు. మధ్యాహ్నం నివేదన తరువాత శ్రీరామ, శ్రీకృష్ణ, శ్రీ మదనమోహన ఉత్సవ మూర్తులను రత్న భేది పైన ఉంచే ప్రత్యేక పూజలు చేస్తారు.

ప్రధాన పండా ఏకాంతంగా స్వామివారిని చందాన యాత్రకు, రాబోయే రథయాత్రకు అనుమతి కోరుతారు. లభించిన అనుమతిని లేఖ రూపంలో ఉంచి చందనయాత్ర సంబరాలను అట్టహాసంగా ప్రారంభిస్తారు. శ్రీకోవెల నుండి నరేంద్ర సరోవరం వరకు రహదారులను జగన్నాథుని రాక కోసం పుష్పాలు, అరటి మండపాలలో సుందరంగా అలంకరిస్తారు. దారికి ఇరుపక్కలా భక్తులు నల్లనయ్యకు ఎండ వేడి సోకకుండా ఛత్రాలను పట్టుకొని నిలబడతారు. తెలుపు, ఎరుపు వస్త్రాలు, పుష్ప మాలలతో అందంగా అలంకరించిన పల్లకీలలో శ్రీ దేవి, భూదేవి దేవి సమేత శ్రీ మదనమోహన స్వామి, శ్రీరామ, శ్రీకృష్ణ, లోకనాథ, మార్కండేశ్వర, కపాల మోచన, జంబేశ్వర, నీలకంఠ అనే పంచ పాండవ లింగాలను ఉంచి మేళతాళాలు, భజనలు, కీర్తనలతో స్తుతిస్తూ నరేంద్ర సరోవరానికి చందన యాత్ర బయలుదేరుతుంది.

## నరేంద్ర సరోవరం

పూరీని పాలించిన కపిలేంద్ర దేవ మహారాజు పుత్రుడైన నరేంద్ర దేవ రాజకుమారుడు శ్రీ జగన్నాథుని పట్ల ఎంతో భక్తి విశ్వాసాలు కలిగినవాడు. చందనయాత్ర నిర్వహించడానికి ఎనిమిది ఎకరాల విశాల సరోవరాన్ని నిర్మించారు. ఈ కారణంగా ఆయన పేరుతోనే పిలుస్తున్నారు. సరోవరం మధ్యలో ఉన్న చిన్న ఆలయం చేరుకోడానికి వంతెన నిర్మించారు.

## రథానికి అనుమతి


పూరి రాజభవనం పేరు 'శ్రీనార్'. నరేంద్ర సరోవరానికి వెళ్లే దారిలో ఉంటుంది. చందనయాత్రకు తరలి వెళుతున్న జగత్ప్రభువును పూరి మహారాజు సాంప్రదాయ బద్ధంగా సేకరించిన కలప శిల్పులు రథయాత్రకు కావలసిన రథాల తయారీకి అనుమతి కోరుతారు. స్వామి తమ అంగీకారం తెలిపిన తరువాత కలపకు పూజలు చేసి రథాల నిర్మాణానికి స్వీకారం చుడతారు. సరోవరానికి చేరిన లోకనాథుని "భైరలేక, సునంద అనే నావలలో ఉపస్థితులను చేసి భక్తుల హర్షధ్వానాల మధ్య సరోవరంలో విహారం మొదలు పెడతారు. చీకటి పడేంత వరకు విహారం జరిపి స్వామి వార్లను సరోవరం మధ్యలో ఉన్న ఆలయానికి తరలించి, ఉపచారాలు చేసి మరోసారి అలంకరిస్తారు. అర్ధరాత్రి వరకు భక్తుల జయజయ ధ్వనుల మధ్య ఇరవై ఒక్క రోజుల పాటు ఈ బాహార యాత్ర కొనసాగుతుంది. ఆఖరి రోజున మూల మూర్తులను స్నాన బేదికి తరలించి ప్రాంగణంలో ఉన్న 'సోనా కువ' (బంగారుబావి) నీటితో స్నాన యాత్ర నిర్వహిస్తారు. వేలాదిమంది భక్తులు ఆలయం వెలుపల నిలిచి అపురూపమైన స్నాన యాత్రను వీక్షిస్తారు.

## బిత్తర యాత్ర/అనావాస పట్టి

శ్రీ జగన్నాథ సంప్రదాయంలో బిత్తర యాత్ర ముఖ్య భాగం. వాతావరణం, అధిక జలక్రీడలు స్నానం వలన ఆదిదేవునికి శారీరక అస్వస్థత ఏర్పడుతుంది. ఈ కారణంగా బిత్తర యాత్ర సమయంలో మూలవిరాట్టుల దర్శనం లభించదు. వెలుపల ఉన్న అనావాసర పట్టి అంటే చిత్రపటాలను మాత్రమే దర్శించుకొని అవకాశం ఉంటుంది. బిత్తర యాత్ర సందర్భంగా అస్వస్థతకు లోనైన మూలమూర్తులకు పథ్యపు ఆహార నివేదన చేస్తారు. ఆయుర్వేద వనమూలికలు ఫలాలు మాత్రమే ఉంటాయి. ఇరవై ఒక్క రోజుల బిత్తర యాత్ర సందర్భంగా మూగబోయిన పూరి 'నవయవ్వన దర్శనం' తో నూతన శోభను సంతరించుకొంటుంది.

## నవ యవ్వన దర్శనం

అనారోగ్యంతో సేదతీరిన ఆదిదేవునికి స్నాన యాత్ర సందర్భంగా కళావిహీనం కావడంతో తిరిగి సుందరంగా తీర్చిదిద్ది రథయాత్రకు సిద్ధం చేసిన సందర్భంగా భక్తులకు లభించే అపూర్వ దర్శన ఈ నవ యవ్వన దర్శనం. అప్పటికి రథాలు యాత్రకు సిద్ధం అవుతాయి. విశ్రాంతి తీసుకొన్న సమయంలో తన అనారోగ్యం గురించి వేదన చెందిన ప్రజల వద్దకు పరమాత్మ స్వయంగా తరలివెళ్లే రథయాత్రకు అంతా సిద్ధం అవుతుంది.

## రథయాత్ర

గర్భాలయం దాటి నగర విహారానికి వచ్చేది శ్రీ జగన్నాథ మందిరంలో తప్ప మరెక్కడా ఇలాంటి విశేషం కనపడదు. ఎన్నో ప్రత్యేక పూజలకు కేంద్రమైన ఈ ఆలయంలో అత్యంత ప్రధానమైనది రథయాత్ర. పరంధాముడు స్వయంగా తన భక్తుల వద్దకు వెళ్లడం ఈ రథయాత్రలోని ప్రత్యేకత. శ్రీ జగన్నాథ స్వామి అన్న బలరాముడు, చెల్లెలు సుభద్రతో కొలువైన ఏకైక ఆలయం పూరి క్షేత్రం. గర్భాలయ అర్చనామూర్తులు వేపచెట్టు కాండంతో చేయడం మూలవిగ్రహాలు కాళ్లు, చేతులు లేకుండా వుండటం ఎక్కడ లేని అద్భుతం. ప్రతి సంవత్సరం ఆషాఢమాసంలో జరిగే రథయాత్ర గురించి స్కంద, బ్రహ్మ, పద్మ పురాణాలలో పేర్కొన్నారు. ఇక్కడ సోదరితో కలిసి చేసే రథయాత్రలో రథాలు ప్రతి సంవత్సరం కొత్తవి తయారు చెయ్యడం విశేషం.

## గుండిచా మందిరం

శ్రీమందిరం నుండి శ్రీ జగన్నాథ, బలభద్ర, సుభద్ర మూడు కిలోమీటర్ల దూరంలో ఉన్న గుండిచా మందిరానికి వెళతారు. అక్కడ తొమ్మిది రోజులు గడిపి తిరిగి శ్రీక్షేత్రం చేరుకొంటారు.

**నంది ఘోష:** శ్రీ జగన్నాథుడు ప్రయాణించే రథాన్ని నంది ఘోష అని పిలుస్తారు. నలభై నాలుగున్నర అడుగుల ఎత్తు, పదహారు చక్రాలు కలిగి ఉంటుంది. ఎరుపు, పసుపు వస్త్రాలతో అలంకరిస్తారు. **తాళ ధ్వజ:** నలభై మూడు అడుగుల ఎత్తైన తాళ ధ్వజను ఎరుపు, నీలి వస్త్రాలతో అలంకరిస్తారు. **దర్పదళన:** సుభద్రా దేవి ప్రయాణించే రథాన్ని దర్పదళన అని అంటారు. ఈ రథాన్ని నలుపు, ఎరుపు వస్త్రాలతో అలంకరిస్తారు. దర్పదళన చివరగా బయలుదేరుతుంది. రత్న బేది నుండి బలభద్ర, జగం సుభద్ర విగ్రహాలను సబర రాజు విశ్వావసు వంశానికి వంశానికి చెందినవారే వెలుపలికి తెచ్చే అధికారం కలిగి ఉంటారు. సుమారు వంద మంది చొప్పున అంచెలంచెలుగా ఒకో విగ్రహాన్ని నిర్దేశిత రథాల మీదకు చేర్చేటప్పటికీ సాయంత్రం అవుతుంది దేశ విదేశాల నుండి తరలి వచ్చిన లక్షలాది భక్తులతో కిటకిటలాడుతుంటుంది. భక్తి గీతాలు, నామ సంకీర్తన, భజన కీర్తనలతో ఆ ప్రాంతం అంతా హోరెత్తిపోతుంటుంది. నలు దిశలా ఆధ్యాత్మిక పరిమళం వెదజల్లుతుంటుంది.

ముగ్గురు అర్చామూర్తులు ఉపస్థితులైన తరువాత పూరీ రాజు విచ్చేస్తారు. స్వర్ణ పిడి కలిగిన చీపురుతో శుభ్రం చేసి కస్తూరి కళ్లాపి జల్లుతారు. హారతి ఇచ్చాక రథాలు గుండిచా మందిరానికి బయలుదేరుతాయి. మొదట నందిఘోష కదిలినా అగ్రస్థానం అగ్రజునిదే. మందు తాళ ధ్వజ, వెనుక దర్ప దళన చివరగా నందిఘోష భక్తుల జయజయ ధ్వానాల మధ్య బయలుదేరిన రథాలు మూడు కిలోమీటర్ల దూరంలో ఉన్న గుండిచా మందిరానికి చేరేటప్పటికి మరుసటి రోజు తెల్లవారిపోతుంది. అప్పటికీ భక్తుల కోలాహలం రెండింతలు అవుతుంది. జగన్నాథుడు గుండిచా మందిరంలో బస చేసిన సమయంలో వంటశాల కూడా అక్కడికి చేరుకుంటుంది. శ్రీక్షేత్రంలో జరిగే విధంగా పూజాదికాలు నిర్వహిస్తారు. వాటిలో **హేర పంచమి ఒకటి. అంటే అర్ధాంగి అలక.** గుండిచా మందిరానికి చేరిన అయిదవ రోజున ఈ ఘట్టం జరుగుతుంది.

రథయాత్రకు బయలుదేరుతూ జగన్నాథస్వామి లక్ష్మీదేవికి నేను రేపటికల్లా తిరిగి వస్తాను అని చెప్పారట. అయిదు రోజులైనా స్వామివారి జాడ లేకపోవడంలో పరిచారికలను, భటులను నలుదిక్కులా పంపిస్తుంది అమ్మవారు. శ్రీవారు అన్న, చెల్లెలితో కలిసి గుండిచా మందిరంలో వున్నారన్న విషయం తెలుస్తుంది. ఆగ్రహంతో అమ్మవారు మందీ మార్బలంతో గుండిచా మందిరానికి వెళుతుంది. కానీ అక్కడి ద్వారపాలకులు ఆమెను లోపలికి వెళ్లనివ్వరు. తీవ్రమైన అసహనంతో అమ్మవారు శ్రీక్షేత్రానికి తిరిగి వెళుతూ కాలితో నందిఘోషను తన్నుతుంది. రథం తాలూకు చిన్న ముక్క విరిగి పడుతుంది. ఈ కారణంగానే రథయాత్ర ముగించుకొని తిరిగి శ్రీక్షేత్రానికి చేరిన స్వామి అమ్మవారిని ప్రసన్నం చేసుకోడానికి బాయిసి పహచ వద్ద స్తోత్రపాఠాలు చేస్తారు. ఈ ఘటాన్ని అర్చక పండాలు చక్కని హావభావాలతో ప్రదర్శిస్తారు.

## బహుదా యాత్ర

తొమ్మిది రోజులు గుండిచా మందిరంలో సేద తీరిన జగన్నాథుడు దశమి నాడు శ్రీక్షేత్రానికి తిరుగు ప్రయాణం అవుతారు. దీనినే బహుదా యాత్ర అంటారు. స్థానికంగా 'బావడ' అని అంటారు. దారిలో అర్ధపని ఆలయం వద్ద పినతల్లి యాభై రకాల తీపి పదార్థాలను రుచి చూస్తారు. అలిగిన లక్ష్మీదేవి ఇక్కడికి వచ్చి స్వాగతం పలకడం కొసమెరుపు. మూలవిరాట్టులు ఏకాదశినాడు రథాలలోనే గడుపుతారు. ఆరోజు అనేక స్వర్ణాభరణాలతో అలంకరిస్తారు. దీనిని 'సోనా బేష' అంటారు. దశమిరోజున తిరిగి మూలవిరాట్టులు రత్న బేదిపైన కొలువు తీరుతారు.

ప్రతిఒక్కరు జీవితంలో ఒక్కసారైనా జగన్నాథ రథయాత్ర చూడాలని ఆశిస్తారనటంలో ఏమాత్రం అతిశయోక్తి లేదు. సుందర సాగర తీరంతో అత్యంత అరుదైన దైవ దర్శనంతో శారీరక, మానసిక ఆహ్లాదం పొందాలంటే తప్పక సందర్శించవలసిన క్షేత్రం పూరీ.




## చాలా ఉన్నాయి

"నేను ఫలానా బ్యాంక్ నుండి కాల్ చేస్తున్నాను. మీకు లోన్ ఏదైనా కావాలా? మా దగ్గర వడ్డీ చాలా తక్కువ."

"సరే, నేను ఫలానా రియల్ ఎస్టేట్‌లో పని చేస్తున్నాను. మీ బ్యాంక్‌లో ఉన్న డబ్బంతా మా ఫ్లాట్స్ కొనడానికి వాడండి. మా దగ్గర కూడా అమ్ముడు కాని ఫ్లాట్స్ చాలానే ఉన్నాయి"

– కె.లహరి, కరీంనగర్

## పక్కింటోళ్లు

బాధితుడు: "నా మీద ఎవరో చేతబడి చేయించారని అనుమానంగా ఉందండీ"

స్వామీజీ: "ఆ అనుమానం నీకు ఎందుకు వచ్చింది?"

బాధితుడు: "ఈ మధ్య నీరసంగా ఉంటోంది. అదీ కాకుండా నేను బయట దండెం మీద ఆరేసిన నా షర్ట్ కనిపించడం లేదు.. చేతబడి చేయడానికి ఆ వ్యక్తి బట్టలు వెంట్రుక లాంటివి తీసుకుంటారు కదా!"

స్వామీజీ: "నా దివ్య దృష్టితో దండెం మీద ఆరేసిన నీ బట్టలు ఎవరు తీసారో చూస్తాను."

బాధితుడు: "చూసారా స్వామీ?"

స్వామీజీ: "మీ ఇంటి పక్కవాడు సైకిల్ తుడవడానికి నీ షర్ట్ దొంగలించాడు నాయనా!"

– ఎస్ కె.యాకూబ్ పాషా, ఖమ్మం.

## లీకయితే..

"మన అబ్బాయి ఎప్పుడు పాసవుతాడండీ?" అడిగింది విమల భర్తతో.

"క్వశ్చన్ పేపర్లు లీకయినప్పుడు మన అబ్బాయి పాసవుతాడు. అంతవరకు పరీక్షలు రాస్తూనే ఉంటాడు."

## నేషనల్ టీం..

కామేశ్: "నీకు బ్యాటింగ్, బౌలింగ్, ఫీల్డింగ్ ఏదీ సరిగా రాదు కదా. ఇప్పుడు ఏం చేస్తున్నావురా?" అడిగాడు మిత్రుడు రాకేష్‌ని.

"నేషనల్ టీంకి ట్రై చేస్తున్నాను" సమాధానమిచ్చాడు రాకేష్.

## నాకు తెలుసుగా..

కాంతం: "కొలతలకి పాత జాకెట్ తెచ్చానండీ" అంది టైలర్‌తో.

టైలర్: "ఎందుకండీ? మీ కొలతలు నాకు తెలుసు కదా!" అని నాలిక కొరుక్కున్నాడు.

....

"మమ్మీ, మనం మానవులుగా పుడితే ఎంతో బాగుండేది కదా!" అంది పిల్లచీమ తల్లిచీమతో.

"ఎందుకు?" అంది తల్లిచీమ.

"ఏదో ఒక దేశానికి ప్రధాన మంత్రి అయ్యేవాళ్లం కదా!" పిల్లచీమ సమాధానం.

"అమ్మ భడవా? ఎంత పెద్ద పెద్ద ఆలోచనలు నీవి" అంటూ నోరెళ్లబెట్టింది.

## ఐ యామ్ వెరీ బిజీ

"ఏం అప్పారావు? ఏ ఉద్యోగం చేయకుండా ఖాళీగా తిరిగేస్తున్నావు? ఇల్లెలా గడుస్తోంది?" అడిగాడు సుబ్బారావు.

"నేను ఖాళీగా వున్నానని ఎవరు అన్నారు?"

"నేను అంటున్నాను"

"నేను ఖాళీగా ఏమీ లేను. మా ఆవిడ ఉద్యోగం చేస్తోంది. ఇంట్లో ఆవిడ చెయ్యాల్సిన పనులన్నీ నేను చేస్తున్నాను".

## తిట్లు తినకుండా!

"రమేశ్‌గారూ, మా షాపులో కాయగూరలు కొనేటప్పుడు దేవుడికి దండం పెట్టుకుంటారు, ఎందుకు?"

"నేను తీసుకెళ్లిన కాయగూరలు చూసి మా ఆవిడ నన్ను తిట్టకుండా ఉండేందుకు..".

## పెళ్లి చేసుకోరుగా!

దేవుడికి దండం పెడుతూ "నాకు తెలివైన భర్తను ప్రసాదించు స్వామీ" అంది.




"తెలివైనవాడు పెళ్లెందుకు చేసుకుంటాడు?" అని మనసులో అనుకున్నాడు దేవుడు.

– వైదా ఈశ్వరరావు, విశాఖపట్నం

# హాస్య కవిత

మా ఆవిడ పేరు సింధూరం
నా పేరు సర్వర్ సుందరం
మా ఆవిడది అన్నవరం
మాది గన్నవరం
చదువుకున్నాం మేమిద్దరం సబ్బవరంలో
ప్రేమించుకున్నాం పోలవరంలో
పెళ్లి చేసుకున్నాం ముప్పవరంలో
మా ఆవిడకు చదువులో
రెండు సున్నాలే
అమ్మో...! నాకు ఎన్ని సున్నాలో
మా ఆవిడ
నవ్వులు
సంపంగి
పువ్వులు
నా
నవ్వులు
నల్లని
గవ్వలు
మా ఆవిడ
సిగ్గులు
ముత్యాల ముగ్గులు



నా సిగ్గులు జగిత్యాల బొగ్గులు
మా ఆవిడ ప్లాస్టిక్ గిన్నెల్లో వంట
చేస్తుంది
నేను జల్లెడతో నీళ్లు తెస్తాను
ఆహా..!
మా వంట ఎంత రుచిగా ఉంటుందో!
ఊరంతా నవ్వుకునేలా
వింతగా ఉంటుంది.
మా కాపురం ఒక నవ్వుల సంత.

– సంపంగివారి జయచంద్రారెడ్డి
బాపట్ల

## బతుకును బలిచేయకు

**జీవితం** విలువైనది
క్షణికావేశానికి గురికావద్దు
బంగారం లాంటి బతుకును
బలి చేయకు.

గెలుపు ఓటములు పొగడ్తలు తెగడ్తలు
ఆకాశంలో తెప్పల్లాంటివి
చీకటి వెలుగులు
ప్రకృతి సహజం
సమస్యలకు
భయపడకు
ధైర్యంతో
ఎదుర్కో.

ఉల్లాసం
ఉత్సాహం
జీవన శైలి
అయితే
సంతోషం
సంతృప్తి నీ
ఆస్తులు
అవుతాయి.

సానుకూలతను పెంచుకో
సంతోషాలను పంచుకో.

సజ్జన సాంగత్యం సమాజ సేవ



ఆధ్యాత్మిక చింతన ఆత్మవిశ్వాసాన్ని
పెంచుకో.

మానసిక ఆరోగ్యాన్ని
రక్షి ద్దాం
ఆత్మహత్యలు అరికడతాం
ఆత్మహత్యలు వద్దు
ఆరోగ్యకరమైన జీవనమే
ముద్దు.

కుటుంబ వ్యవస్థ
పునరుద్ధరణతో
ఆత్మీయత అనురాగ
బంధాలు
అనుబంధాల
పూల తోటలో
మమత
మానవీయతను
పరిమళింపచేద్దాం.

మనోధైర్యమనే ఆయుధంతో
ఆత్మహత్యలను అరికడుదాం..

## ఈ వారం కవిత్వం

## నిన్ను నీవు..

**ఇతరుల** హృదయాలలోకి
చొచ్చుకెళ్లే ముందు
నీ గుండె చప్పుడు విను!
వాళ్ల ఆనందంలో నిన్ను వెతకకు
నీ లోపలే ఓ వెలుగు ఉంది!
వాళ్ల నవ్వులో నీ సంతోషం వెతకకు!
వాళ్లు ఏడిస్తే నీవు ఎందుకు
వేదన పడతావు?
ఒక సెలబ్రిటీకి నీ ఊపిరి అంకితం
చేస్తే, నీ తల్లి కన్నీళ్లని ఎవరు
తుడుస్తారు?
పోస్టర్ల కింద నీ కలల్ని ఉంచకు
ఓ రీల్ కోసం నీ రియల్ లైఫ్
పోగొట్టుకోకు! ..వాళ్లు బతుకుతారు
గ్లామర్ వెలుగుల్లో.. నీవు? చీకట్లోనే
మిగిలిపోతావు! అభిమానం తప్పు కాదు
కానీ అదే నీ శ్వాసైతే
అది శాపమే!
ప్రేమించు.. కానీ పరులను కాదేమో!
మొదట నీవే నిన్ను నీవు!

**- డా॥ మామిడాల శైలజ**

## ఈ నగరానికి ఏమయింది?


హృదయంలో
ఏదో తెలియని
ఘోష
కళ్లలో ఏదో తెలియని సముద్రపు హోరు
ఈ నగరానికి ఏమయింది?
ప్రతి ఒక్కరికీ ఏమయింది

మనిషి ఉంటే మనసుంటుంది
మనసుంటే స్పందిస్తుంటుంది
ప్రతి మనిషికీ చలనం లేదు
రాయిలాగ స్పందన లేకుండా ఉన్నారు
ఏమిటో!

మనిషి ప్రయాణం
ఏటో!
ఒంటరితనపు ఈ
మజిలీ ఏమిటో
అంతులేని జీవిత పోరాటంలో
ఓ మనిషీ! నీవు ఒంటరివాడివే
మనిషికి మారడం సహజమా?
మనిషి నీడను చూసుకొని
ఉలిక్కిపడే ఈ స్థితి ఏమిటో!
అద్దం కూడా మనిషి ప్రతిబింబం
చూసి ఉలిక్కిపడింది.. ఎందుకో?

**- అరుణ డేనియల్**

## అంతరంగం



ఏదో తెలియని నిర్లిప్తత...
ఏదో తెలియని సందిగ్ధత...
ఏదో తెలియని నిశ్శబ్దత...
ఎందుకోసం అని ఆలోచిస్తే
బతుకు తెరువు భయం కోసమా...
సుఖం కోసమా...
ఆధిపత్యపు ఆరాటం కోసమా...
బతుకు బంధాల అందం కోసమా...
బాంధవ్యాల ఆనందం కోసమా...
చలిగుండెల మెప్పు కోసమా...
చిరకాలపు ఆనందం కోసమా...
జీవిత కాలపు సాఫల్యం కోసమా...
ఎందుకోసం.. ఎందుకోసం
ఈ ఆరాటం ఈ పోరాటం
ఈ పెనుగులాట...
ఈ సందిగ్ధతపు తోట
మరువాలన్నా మరువలేని కథ...
ఛేదించాలన్నా ఛేదించలేని రహస్యం...
బంధించాలన్నా బంధించలేని వ్యథ
నిరంతరం మండే అగ్నిని
నిరంతరం వెంటాడే ఆలోచనని...
ఈ మనో మందిరపు ఊటబావి నుండి
పెకిలించుకు వస్తున్న ఆలోచనల
ప్రవాహం నుండి పుట్టుకొస్తున్న
ఆలోచనలను చూచి
పసి మనసు ఏమీ చేయలేని
నిస్సహాయతతో తలదించుకుని
తనలోని అహాన్ని బలపరుచుకుంటూ...
భయాన్ని బహిర్గతం చేస్తూ...
ఆవేదనను వెలిబుచ్చుతూ...
ఆవేశాన్ని తొక్కివేస్తూ...
తనలోని ఖాళీతనాన్ని
విషయ వాంఛలతో నింపుతూ...
ఈ క్షణంలో ఏదో
సాధించాలనే తహతహ..
ఏదో బద్దలు చేయాలనే భావావేశం..
ఏదో కొత్తదనం కోసం
పెరుగుతున్న గుండె దడ ...
అలాగే ఆగని
ఆలోచనల పరంపర.

**- చల్లా రమేష్ కుమార్**

# నోరూరించే వంటకాలు

## గుమ్మడి హల్వా

**కావలసిన పదార్థాలు**

ఎర్ర గుమ్మడి తురుము–ఒక కప్పు; నెయ్యి–పావు కప్పు; పాలు–అర కప్పు; చక్కెర–అర కప్పు; యాలకుల పొడి–చిటికెడు; తరిగిన బాదం, కాజు–పావు కప్పు.



**తయారు చేసే విధానం**

స్టౌ మీద ప్యాన్ పెట్టి ఒక టేబుల్ స్పూన్ నెయ్యి వేసి, నెయ్యి బాగా వేడయ్యాక గుమ్మడి తురుము జోడించాలి. దాన్ని సన్నటి మంటపై దాదాపు ఐదు నిమిషాల పాటు వేయించాలి. వేగిన గుమ్మడి మిశ్రమంలో పాలు పోసి మూత పెట్టి, మరో రెండు నిమిషాలు ఉడికించాలి. చక్కెర, యాలకుల పొడి కలుపుతూ దగ్గర పడనివ్వాలి. స్టౌ మీద మరో ప్యాన్ పెట్టి మిగతా నెయ్యి వేసి కాజు, బాదం వేయించి నెయ్యితో సహా గుమ్మడి మిశ్రమంలో వేయాలి. నెయ్యి పైకి తేలే వరకు వేయించాక దాని మీద బాదం, కాజు జోడిస్తే నోరూరించే గుమ్మడి హల్వా రెడీ.

## రాగి ఇడియప్పం

**కావలసిన పదార్థాలు**

రాగి పిండి–ఒక కప్పు; బియ్యపు పిండి–అర కప్పు; నూనె–ఒక టేబుల్ స్పూన్; ఉప్పు–తగినంత.



**తయారు చేసే విధానం**

స్టౌ మీద ప్యాన్ పెట్టి రాగిపిండి, బియ్యపు పిండి వేసి సన్నని మంటపై అయిదు నిమిషాలు వేయించాలి. ఒక గిన్నెలో ఒకటిన్నర కప్పు నీళ్లు, ఒక టీస్పూన్ నూనె, కొద్దిగా ఉప్పు వేసి మరిగించాలి. వేడి నీళ్లను పిండిలో వేసి బాగా కలిపి చల్లారే వరకు పక్కన పెట్టాలి. చల్లారిన పిండిని ముద్దలా చేయాలి. స్టౌ మీద ఇడ్లీ పాత్ర కానీ, గిన్నె కానీ పెట్టి ఆవిరికి నీళ్లు పెట్టాలి. పిండి ముద్దను కొద్దికొద్దిగా తీసుకుని జంతికల గొట్టంలో వేసి ఒత్తుకుని ఆవిరిపై ఉడికించాలి. ఆ పైన కొబ్బరి పొడి చల్లుకుంటే వేడివేడి రాగి ఇడియప్పం సిద్ధం.

## ముల్లంగి పరోటా

**కావలసిన పదార్థాలు**

గోధుమపిండి–రెండు కప్పులు; ముల్లంగి తురుము–ఒక కప్పు; పచ్చిమిర్చి–రెండు, అల్లం; అంగుళం ముక్క; ఆమ్‌చూర్, గరం మసాలా, ధనియాల పొడి, జీలకర్ర పొడి, కారం, చాట్ మసాలా–ఒక టీస్పూన్ చొప్పున; ఉప్పు– తగినంత; కొత్తిమీర తురుము– కొద్దిగా; నూనె–సరిపడినంత.

**తయారు చేసే విధానం**



ముందుగా గోధుమపిండిలో ఉప్పు, ఒక టేబుల్ స్పూన్ నూనె వేసి తగినన్ని నీళ్లు పోసి చపాతీ పిండిలా కలిపి అరగంట పాటు నానబెట్టుకోవాలి. ముల్లంగి తురుములోని నీళ్లను గట్టిగా పిండి పెట్టుకోవాలి. ఒక గిన్నెలో ముల్లంగి తురుము, సన్నగా తరిగిన పచ్చిమిర్చి, అల్లం, ఆమ్‌చూర్, గరం మసాలా, ధనియాల పొడి, జీలకర్ర పొడి, కారం, చాట్‌మసాలా, తగినంత ఉప్పు, కొత్తిమీర వేసి బాగా కలుపుకోవాలి. ఇప్పుడు గోధుమపిండి తీసుకుని కొద్దిగా ఒత్తుకుని మధ్యలో ముల్లంగి తురుము పెట్టి అంచులు మూసి పరోటాలా ఒత్తుకోవాలి. పెనం వేడయ్యాక రెండు వైపులా నూనె వేసి కాల్చుకుంటే ముల్లంగి పరోటా సిద్ధం.

## మీల్‌మేకర్ వడ

**కావలసిన పదార్థాలు**



సోయా గ్రాన్యూల్స్ (మీల్ మేకర్స్)–ఒక కప్పు; ఉల్లిగడ్డ–ఒకటి; పచ్చిమిర్చి–నాలుగు; అల్లం–అంగుళం ముక్క; వెల్లుల్లి రెబ్బలు–ఐదు; కరివేపాకు–రెండు రెబ్బలు; నూనె–వేయించడానికి సరిపడినంత; ఉప్పు–తగినంత, కొత్తిమీర తురుము–కొద్దిగా; శనగపప్పు–పావు కప్పు; శనగపిండి–రెండు టేబుల్ స్పూన్లు; కార్న్‌ఫ్లోర్–ఒక టేబుల్ స్పూన్; ధనియాలు–ఒక టేబుల్ స్పూన్; జీలకర్ర–ఒక టీస్పూన్; దాల్చిన చెక్క– అంగుళం ముక్క; లవంగాలు–ఆరు.

**తయారు చేసే విధానం**

సోయా గ్రాన్యూల్స్‌లో కొద్దిగా ఉప్పువేసి, వేడినీళ్లు పోసి గంటపాటు నానబెట్టి గట్టిగా పిండుకోవాలి. ధనియాలు, దాల్చిన చెక్క, లవంగాలను బరకగా పొడి చేసుకోవాలి. ఒక గిన్నెలో సోయా గ్రాన్యూల్స్, తరిగిన ఉల్లి, పచ్చిమిర్చి, కరివేపాకు, నానబెట్టిన శనగపప్పు, తరిగిన అల్లం, వెల్లుల్లి, కొత్తిమీర, ఉప్పు, జీలకర్ర, మసాలాపొడి వేసి బాగా కలిపి శనగపిండి, మసాలా పొడి, కార్న్‌ఫ్లోర్ వేసి కొద్దిగా నీళ్లు చల్లి గట్టిముద్దలా కలుపుకోవాలి. స్టౌ మీద కడాయి పెట్టి వేయించడానికి సరిపడా నూనె పోసుకుని, బాగా వేడయ్యాక మిశ్రమాన్ని కొద్దికొద్దిగా తీసుకుని అరచేతిలో ఒత్తుకుని వడలు వేసుకుంటే రుచికరమైన మీల్‌మేకర్ మసాలా వడలు సిద్ధం.

# అక్కడ.. అందరూ సంపన్నులే!

**అది చిన్న దేశం. అయినా ఆ దేశంలో ఎక్కడ చూసినా అంతా ధనవంతులే కనిపిస్తారు. ఫ్రాన్స్‌కు ఆగ్నేయంగా ఉన్న మధ్యధరా తీర ప్రాంతం. ఆ దేశ జనాభా సుమారు ముప్పై ఎనిమిది వేలు. కానీ ఎటు చూసినా ఖరీదైన కార్లు, భవంతులు దర్శనమిస్తాయి.**



ప్రపంచంలో ఎక్కడా లేనంత మంది మిలియనీర్లు కనిపిస్తారీ దేశంలో. కొంతమంది ఆ దేశంలో స్థిర నివాసం వుండాలని కోరుకుంటే, మరికొందరు అక్కడి చిరునామా ఉంటే చాలని భావిస్తారు. ధనవంతుల స్వర్గధామంగా పిలవబడే ఆ దేశం మొనాకో.

ఇంత చిన్న దేశంలో లాంబోర్గినీ, రోల్స్ రాయిస్‌తో పాటు అనేక రకాల కార్లు తిరుగుతుంటాయి. తీర ప్రాంతంలోనూ ఫ్లోటింగ్ మాన్షన్స్ దర్శనమిస్తాయి. మొనాకోలో ఫార్ములా వన్(గ్రాండ్ ప్రిక్స్) రేసింగ్ భారీ స్థాయిలో జరుగుతుంది.

దీనిని చూసేందుకు వచ్చిన వారితో వీధులన్నీ నిండిపోతాయట. పేరుకు చిన్న దేశమైనా సంపదలో మాత్రం ప్రపంచంలో అగ్ర దేశాల సరసన ఉంటుంది. ఈ దేశంలో నివసిస్తున్న ప్రతి ముగ్గురిలో ఒకరు సంపన్నులని తెలుస్తోంది.

## పన్నులు లేవు

సురక్షిత ప్రాంతం, అంతర్జాతీయ స్కూళ్లు, ప్రపంచ స్థాయి వైద్య సదుపాయాలు, ఆదాయపు పన్ను నిబంధనలు మొదలైన సౌలభ్యాల వల్ల సంపన్నులు ఈ దేశం చూస్తున్నాయని చెప్పవచ్చు. ఇక్కడ వ్యక్తిగత ఆదాయపు పన్ను ఉండదు. మూలధన లాభాల పన్ను కూడా లేదు. వారసత్వ పన్ను చెల్లించాల్సి పని లేదు. కొందరికి వున్నా గరిష్ఠంగా 16 శాతం మాత్రమే ఉంటుంది. సంపన్నులు మొనాకో వైపు చూడటానికి ఉన్నత జీవన ప్రమాణాలు, రాజకీయ స్థిరత్వం కూడా కారణాలుగా కనిపిస్తున్నాయి.

19వ శతాబ్దం మొదట్లో తీవ్ర ఆర్థిక సంక్షోభాన్ని ఎదుర్కొంది. ఆ సమయంలో మాంటే కార్లో క్యాసినో ఏర్పాటు చేస్తూ ప్రిన్స్ చార్లెస్ III తీసుకున్న నిర్ణయం మొనాకో తలరాతనే మార్చేసింది.

ప్రధానంగా ఆదాయపు పన్ను రద్దు చేయడం సంపన్నులను ఆకర్షించింది. ఫ్రాన్స్ పౌరులకు మినహా మరెవ్వరికీ ఇకనకడ ఆదాయపు పన్ను ఉండదు. ఇందుకు సంబంధించిన 1869లోనే ఒక ఒప్పందం జరిగింది. క్యాసినోల నుంచి వచ్చే ఆదాయాన్నే ప్రభుత్వ ఖర్చులకు వినియోగిస్తారు. రియల్ ఎస్టేట్ పరంగా కూడా అత్యంత ఖరీదైనది.

## ప్రవేశం కష్టం

ఇంత లగ్జరీ నేపథ్యమున్న మొనాకోకు వెళ్లటం అంత సులభం కాదు. ఇక్కడ నివాసం ఏర్పరచుకోవాలన్నా, ఆదాయపు పన్ను ప్రయోజనాలను పొందాలన్నా కొన్ని నిబంధనలు పాటించాల్సి ఉంటుంది. ఇక్కడికి రావాలంటే కనీసం 16 యేళ్లు ఉండాలి. ఎలాంటి నేరచరిత్ర లేదని పోలీసు ధ్రువీకరణ అవసరం. సొంతిల్లు/అద్దె ఇల్లు ఉంటేనే అనుమతి లభిస్తుంది.

ఇక్కడ నివసించటానికి ఆర్థికంగా బాగున్నామని నిరూపించుకోవాల్సి ఉంటుంది. ఏడాదిలో ఆరు నెలల కంటే ఎక్కువ కాలం నివాసం ఉండాలి. అంతకన్నా తక్కువ రోజులు ఉండాలంటే అదనపు డాక్యుమెంట్స్ సమర్పించాల్సి ఉంటుంది. ప్రపంచంలో మొనాకోలో మాత్రమే ఆదాయపు పన్ను మినహాయింపు లేదు.. యూఏఈ, ఖతర్ మొదలైన దేశాల్లోనూ ఇలాంటి సౌలభ్యం వున్న విషయం తెలిసిందే! ■



సింగిల్ పేజీ కథ

# గుండుసున్న

పేట యుగంధర్

సమయం సుమారు పదకొండు కావస్తోంది. అప్పటికే ఎండ ఉధృతంగా ఉంది. సిమెంట్ రేకుల పైకప్పు నుండి వేడి ఆవిర్లు ఇంట్లోకి కొడుతున్నాయి. కుర్చీలో కూర్చున్న పెళ్లికొడుకు తన చేతి రుమాలుతో ముఖాన్ని తుడుచుకుంటున్నాడు.

"అమ్మాయిని పిలిపించండి!" అన్నారు పెళ్లికొడుకు తరపు వారెవరో.

నల్లటి ట్రేలో తెల్లటి కప్పులలో చిక్కటి కాఫీ పట్టుకొచ్చింది పెళ్లికూతురు.

"అబ్బాయికి కాఫీ ఇవ్వమ్మా!" అంటూ



పెళ్లికొడుకు కూర్చున్న కుర్చీ చూపించింది ఒక పెద్దావిడ.

కాఫీ ట్రేతో ఒక్కో అడుగు వేసుకుంటూ కుర్చీ వైపు నడిచింది. కాఫీ కప్పు అందుకుంటున్న అతని చేయి చూసింది. అతని చేయి కాఫీ ట్రే రంగుతో పోటీ పడుతున్నట్టు నిగనిగలాడుతోంది.

తల కాస్త పైకెత్తి అతని వంక చూసింది.

"రంగు నలుపేగానీ కళగలిగిన ముఖం!" అంటున్నారెవరో.

అతని ముఖంలో ఆమెకు ఏ కళా కనబడలేదు. పైగా మనిషి కాస్త ముదిరినట్టు కనిపిస్తున్నాడు. అతని రంగు గురించి, వయసు గురించి ఆమెకు ఏ చింతా లేదు. అతడు తన తండ్రి లాంటివాడు కాకుంటే చాలు! అని మాత్రమే ఆమె కోరుకుంటోంది.

పెళ్లి కొడుకు తరపువాళ్లు తమలో తాము గుసగుసలాడుకుని "మాకు అమ్మాయి నచ్చింది" అని ప్రకటించారు.

"అమ్మాయి కూడా సరే అంటే కట్న కానుకుల గురించి మాట్లాడుకుందాం!" అన్నాడు ఇరుపక్షాల పెళ్లిపెద్ద.

"మేం కట్న కానుకలు ఇవ్వలేమండీ! పెళ్లి కూడా చేయలేం! అమ్మాయిని కట్టుబట్టలతో మాత్రమే పంపగలం. అందుకు మీకు సమ్మతమైతేనే పెళ్లి ఖాయం చేద్దాం!" అన్నాడు పెళ్లికూతురు పెదనాన్న. పెళ్లి కొడుకు తరపు వారందరూ బయటకు వెళ్లారు. వాళ్లలో వాళ్ళు ఏదేదో చర్చించుకుంటున్నారు.

..........

పెళ్లికూతురు పెదనాన్న ఆ అమ్మాయి దగ్గరకు వెళ్ళాడు.

"అబ్బాయిది గవర్నమెంట్ ఉద్యోగం. మంచివాడిలాగే కనిపిస్తున్నాడు. అతడిని చేసుకుంటే నువ్వు సుఖపడతావు!" అని చెప్పాడు.

ఇంటి బయట తన తాగుబోతు తండ్రి ఫుల్లుగా తాగి పిచ్చిపిచ్చిగా వాగుతున్న వాగుడు ఆమెకు లీలగా వినబడుతోంది. అతడు పెట్టే బాధలు తట్టుకోలేక ఆమె పదవ యేటనే ఆమె తల్లి చచ్చిపోయింది.

తల్లిపోయినా తండ్రిలో ఏ మార్పు రాలేదు. విచ్చలవిడితనం మరింత పెరిగింది. నిత్యం తాగిన మత్తులో నోటికొచ్చింది వాగే తండ్రి పట్ల ఆమెకు గౌరవంగానీ, ప్రేమగానీ ఎన్నడూ లేదు. అతడికి తాగుడు తప్ప మరేదీ పట్టదు.

పక్కింట్లో ఉండే పెదనాన్న సాయంతో పది వరకూ చదువుకుంది. అప్పటి నుండి ఏవో చిన్న, చిన్న పనులతో కాలం నెట్టుకొస్తోంది. ఈ తాగుడు కొంప నుండి బయట పడితే చాలని అనుకునేది. వచ్చిపోయే పెళ్లికొడుకులను ఆకర్షించడానికి తన దగ్గర అందం తప్ప మరేదీ లేదని ఆమెకు తెలుసు.

పెళ్ళికొడుకు ఊ.. కొట్టాడని బయట నుండి సమాచారం అందింది. ఆమె ముఖంలో సంతోషం లేదు, బాధా లేదు. పెళ్లి అనబడే ఆ తంతేదో జరిగి, ఈ ఇంటి నుండి బయట పడితే చాలు అనే భావన తప్ప.

..........

గుడిలో పెళ్ళికొడుకువాళ్లే తూతూ మంత్రంగా పెళ్లి జరిపించారు.

"అమ్మాయి అదృష్టవంతురాలు! గవర్నమెంట్ ఉద్యోగస్తుడిని ఖర్చు లేకుండా కొట్టేసింది!" అని మాట్లాడుకుంటున్నారు పెళ్లిలో కొందరు.

"జంటను చూస్తుంటే, కాకి ముక్కుకు దొండ పండు చందంగా ఉంది." అంటూ వారిద్దరి రంగు గురించి గుసగుసలాడుతున్నారు మరికొందరు.

"అందమైన పెళ్లాం కోసం నూరు సంబంధాలు పైనే చూశాడు. అందం తక్కువ ఉన్న అమ్మాయిలు వీడికి నచ్చలేదు, అందమైన అమ్మాయిలు వీడిని మెచ్చలేదు!!" అంటున్నారు ఇంకొందరు.

..........

అత్తారింటికి చేరి మూడు నెలలు పూర్తి కావస్తోంది. మొదటిరోజు ఆమెను అపురూపంగా చూసిన అతని కంటికి ఆమె ఇప్పుడు ఆనట్లేదు. తిట్టడానికి సాకులు, కొట్టడానికి కారణాలు వెతుక్కుంటున్నాడు. అప్పుడప్పుడూ సరదాగా తాగుతానని చెప్పినవాడు, ప్రతిరోజూ తూలుతూ ఇంటికి వస్తున్నాడు. అతడు తిట్టే తిట్లు, కొట్టే కొట్లు ఇరుగు-పొరుగుకి వినపడుతూనే ఉన్నాయి.

అందమైన పెళ్లాం వలన కలిగిన ఆత్మన్యూనత కారణంగా అతడు అలా ప్రవర్తిస్తున్నాడని కొందరు అనుకుంటున్నారు. కట్న కానుకలు లేకుండా రావడమే ఆమె చేసిన నేరమని మరికొందరు చెవులు కొరుక్కుంటున్నారు. తిట్టినా, తన్నినా ఆమె తరపు నిలబడేవాళ్లు లేరన్న ధైర్యంతో అతడు చెలరేగిపోతున్నాడని ఇంకొందరు అభిప్రాయపడుతున్నారు. భూమి గుండ్రంగా ఉన్నట్టు ఒక తాగుబోతు నుండి మరో తాగుబోతు వద్దకు చేరింది ఆమె. గుండ్రంగా ఉన్న ఈ భూమిపై ఆమె జీవితం మరోసారి గుండు సున్న ఆకారంలో కనబడింది. ●

కథ

# ఎవరి జీవితం వారిది

**ఒకసారి** వేటగాడితో ఒక కుక్క వచ్చింది. కుందేలు మొదలైన జంతువులను తరుముతూ అది దారి తప్పింది. కొద్దిసేపు వేటగాడు దానికోసం ఎదురు చూసి, అదే వస్తుందిలే! అనుకుని ఇంటిదారి పట్టాడు.



అడవిలో ఇంటికి వెళ్ళేదారి కోసం వెతుక్కుంటూ వున్న కుక్కను నక్క చూసి "చాలా రోజులుగా నిన్ను చూడాలని అనుకుంటున్నాను. నువ్వూ నా లాగే వుంటావని చాలామంది అంటుంటే విన్నాను. అయినా తెలియక అడుగుతాను. మనుషులకు కృతజ్ఞత తక్కువ అంటారు. ఇప్పుడు నీకది బోధ పడింది కదా! అలాంటి వాళ్లను నమ్ముకుని నువ్వు బతుకుతూ, వారికి విశ్వాసంగా వుంటూ వారు విదిల్చే నాలుగు మెతుకులు తింటూ జీవితం సాగిస్తున్నావు. సిగ్గనిపించడం లేదా? నా మాట విని అడవికి వచ్చేయి. స్వేచ్ఛగా, హాయిగా బతుకొచ్చు. ఒకరికి ఊడిగం చేస్తూ బతకాల్సిన పని లేదు. సింహం రాజు గారికి చెప్పి నీకు వసతి ఆహారం ఏర్పాటు చేయిస్తాను" అన్నది నక్క.

కుక్క ఆలోచనలో పడింది.

"తొందర ఏం లేదు. గ్రామంలోకి వెళ్లి నిదానంగా మీ వాళ్ళతో ఆలోచించి నిర్ణయం తీసుకో. మళ్లీ వచ్చి నీ నిర్ణయం నాకు చెప్పు. నాకూ నీకు ఆనాదిగా పోలికలున్నాయనే ఈ విధంగా అభిమానం చూపిస్తున్నాను. అంతకు మించి ఏమీ లేదు" అని నక్క తన దారిన తాను వెళ్లిపోయింది.

కుక్క మళ్లీ తీవ్రంగా ఆలోచనలో పడింది.

ఇదంతా చెట్టుపైన కాకి విన్నది. నక్క మాటలు దానికి నచ్చలేదు. అది కుక్కతో "ఏమిటి? నక్క మాటలు నీకు నచ్చాయా? ఎవరి బతుకుతీరు వారిది. ఒకరిది ఎక్కువా కాదు, మరొకరిది తక్కువా కాదు. నీతో ఇన్ని మాటలు మాట్లాడిన నక్క గురించి అడవిలో ఏమనుకుంటారో నీకు తెలియంది కాదు. తన జిత్తులతో సాటి జంతువులకు అపకారం చేస్తూ వాటి జాడ సింహానికి తెలియజేస్తూ అది తినగా మిగిలిన ఎంగిలికూడు తింటూ బతుకుతుందని" అంటూ వుంటారు. అయినా అది తప్పని నేను అనడం లేదు. ఎందుకంటే తన బతుకు తనది కనుక. అలాగే నీ జీవితం నువ్వు సాగిస్తున్నావు. నమ్మకానికి విశ్వాసానికి మారు పేరుగా నిలిచి వున్నావు. దాన్ని చెరుపుకోకు. ఎప్పుడూ మరొకరితో పోల్చుకుని మనల్ని మనం తక్కువ చేసుకోకూడదు" అంటూ హితవు పలికింది.

కుక్కకు కాకి మాటలు తృప్తినిచ్చాయి. నక్క మాటలు మనసులో నుంచి ఎగిరిపోయాయి. అందుకే కాకి తెలివితేటల మీద బోలెడు కథలున్నాయి అనుకుంటూ కుక్క గ్రామంలోకి పరిగెత్తింది. మళ్లీ అడవి ముఖం చూడలేదు.

**- డా॥ గంగిశెట్టి శివకుమార్**

## చుక్కలు కలపండి




## బాలగేయం

# పచ్చదనం

నాటుదాం నాటుదాం
ప్రతి ఒక్కరం ఓ మొక్కని!
పెంచుదాం పెంచుదాం
అందరం కలిసి
పచ్చదనాన్ని !
ఆకస్మిక వరదలను
అరికడదాం !
అడుగంటిన జలాలను
సంరక్షి ద్దాం !
గాలి నాణ్యతని
మెరుగు పరుచుకుందాం !
కాలుష్య కోరల నుండి
బయట పడదాం !
ఆటవీకరణకు
పూనుకుందాం !
గ్రీన్‌హౌస్ ప్రభావాన్ని
తగ్గిద్దాం !
సాటీ జీవుల మనగడకు
తోడ్పడదాం !
ప్రకృతి సమతుల్యతను
నిలుపుకుందాం !
ఎరుగుదాం ఎరుగుదాం
ప్రతి ఒక్కరం మన
బాధ్యతని !
నిలుపుదాం నిలుపుదాం
ఎప్పటికీ జీవజాతి
మనుగడని !

**- తిప్పాన హరి రెడ్డి**



**చిన్నారుల ప్రశ్నలకు**
**వార్త సిఎండి, మేనేజింగ్ ఎడిటర్**

# గిరీష్ అంకుల్ సమాధానాలు

**చిట్టిబాబు, అనకాపల్లి**

**ప్రశ్న: పనసకాయలు చెట్టు మానుకే కాయడానికి గల కారణమేమిటి?**

**జవాబు:** కొమ్మ రెమ్మ, దానికి పూత, పిందె, కాయ.. ఇది ప్రకృతి సహజం. పనసపండు చెట్టుకు గల బాగా ఎదిగిన మానుకు కాస్తుంది. ఆడపుష్పాలు (పూత) మాను మీద లేదా బాగా ఎదిగిన కొమ్మల మీద పూస్తాయి. వృక్షాలు అందించే పండ్లలో చాలా బరువుండే పండు ఇదే. దాదాపు 35 కిలోల బరువు వుంటుంది. ఇంత బరువును మోయాలంటే మానుకే సాధ్యం.

మరో ఉదాహరణ: ఆగ్నేయాసియాలో డ్యూరియన్ చెట్టు కూడా నాలుగు కిలోల బరువుండే పండ్లను కాస్తుంది. పనసచెట్లు, డ్యూరియన్ చెట్లు బాగా మందమైన మాను నుంచే గుత్తులు గుత్తులుగా పూత, పిందెలు ఏర్పడతాయి. పనసచెట్టుకు మగ, ఆడ పుష్పాలు విడివిడిగా వుంటాయి. మగ పుష్పాలు కొత్తగా ఎదుగుతున్న ఆకులలో ఆడపుష్పాలకు ఎగువన కనిపిస్తాయి. ఆడపుష్పాలు పొట్టిగా, లావైన మొగ్గలతో మానును ఆధారం చేసుకుని కన్పిస్తాయి. ఇటీవల కాలంలో (2007, మే) మామిడి చెట్టుకు కూడా మాను మీదనే కాయలు కాసాయి. కావలి మండలం సిరిపురం గ్రామంలో ఈ ఘటన జరిగింది. తెగులు సోకి ఎండిపోయిన మామిడిచెట్ల కొమ్మలను నరికేస్తే, వాటిలో ఒక చెట్టు కొమ్మకు చిగురు లేకుండానే కాయలు కాశాయి.

**దీపిక, మంచిర్యాల**

**ప్రశ్న: నీరు వ్యాకోచించడం ఏమిటి?**

**జవాబు:** చాలా వరకూ పదార్థాలన్నీ శీతలీకరణం చెందుతున్నకొద్దీ సంకోచిస్తుంటాయి. కానీ నీటి విషయంలో ఇలా జరగదు. నీరు కేవలం నాలుగు డిగ్రీల ఉష్ణోగ్రతకు చేరుకున్నప్పుడే సంకోచిస్తుంది. అలా కాకుండా నాలుగు డిగ్రీల కన్నా మరింత తక్కువ ఉష్ణోగ్రతకు గురి చేసినప్పుడు, అంటే- మరింతగా శీతలీకరించినప్పుడు నీరు సంకోచించడానికి బదులుగా వ్యాకోచిస్తుంది.

# ఆరోగ్య రక్ష ఎండు ద్రాక్ష

**చూడటానికి ఎంతో చిన్నవిగా ఉండే ఎండు ద్రాక్ష పండ్లను ఆనారోగ్యంతో నీరసించినవాళ్లు కాసిన్ని తింటే వెంటనే కోలుకుంటారు. ముఖ్యంగా మలబద్ధకంతో బాధపడేవాళ్లు ఎండుద్రాక్షను గ్లాసు నీళ్లలో రోజంతా నానబెట్టి ఉదయాన్నే తాగి, పండ్లను తినడం మంచిది. చిన్న పిల్లలకి ఈ నీళ్లు మరీ మంచిది. వీటిలో ఐరన్ కూడా ఎక్కువ. రక్తకణాల ఉత్పత్తికి ఎంతగానో ఉపకరిస్తాయి. చర్మ వ్యాధులకు ద్రాక్షరసంతో మర్దన చేస్తే తగ్గిపోతుంది.**

పోటాషియం, కెరోటిన్, విటమిన్స్ పుష్కలంగా ఉండే ఎండుద్రాక్ష తినడం వల్ల ఎంతో ప్రయోజనం కలుగుతుంది. జీర్ణశక్తికి ఇది చాలా మంచిది, ఊపిరితిత్తుల పనితీరు మెరుగుపరుస్తాయి. వీటిలో ఉండే పీచు కారణంగా మలబద్ధకం, డయేరియాని నివారించి నుంచి బ్యాక్టీరియా పెరుగుదలను ప్రోత్సహిస్తుంది. డ్రైఫ్రూట్స్‌లో ఎండు ద్రాక్షకు ప్రత్యేక స్థానం ఉంది. దీనిలోని పోషకాలు వ్యక్తి శరీరానికి ఎంతో మేలు చేస్తాయి. వాటిని సరైన సమయంలో తినడం చాలా ముఖ్యం. అప్పుడే గరిష్ఠ ప్రయోజనః అందుతుంది. ఎండుద్రాక్షను ఉదయాన్నే తీసుకోవడం వల్ల శరీరానికి అవసరమైన పోటాషియం, ఐరన్ వంటి పోషకాలు కూడా అందులాయి. రోజంతా శరీరానికి అవసరమైన శక్తిని అందిస్తుంది.



## ఉపయోగాలు

ఎండు ద్రాక్షలో పాలీఫెనాల్స్, ఫ్లేవనాయిడ్స్ ఉంటాయి. ఇవి యాంటీ ఆక్సిడెంట్లు, ఫ్రీ రాడికల్స్, వాపును తగ్గించడంలో సహాయపడతాయి. జర్నల్ ఆఫ్ న్యూట్రిషనల్ హెల్త్‌ని ఒక అధ్యయనంలో ఎండుద్రాక్ష మంట, సూక్ష్మజీవుల ఎరుగుదలకు సంబంధించిన కారకాలను నిరోధిస్తుందని పేర్కొన్నారు. ఇది గుండె జబ్బులు, కేన్సర్ వంటి దీర్ఘకాలిక వ్యాధులను నివారించడంలో ప్రభావవంతంగా ఉంటుంది. మధుమేహంతో బాధపడే వాళ్లకు ఇవి ఉపయోగపడతాయి. వీటిలో పుష్కలంగా ఐరన్ ఉంటుంది. రక్తహీనత రాదు. రోగ నిరోధకశక్తి బాగా పెరుగుతుంది. కాలేయ పనితీరు మెరగవుతుంది. రోజూ ఎండు ద్రాక్ష తినడం వల్ల దంత సమస్యలు తగ్గుతాయి. వీటిలో కాల్షియం ఎక్కువగా వల్ల ఎముకల ఆరోగ్యానికి ఎండు ద్రాక్ష చాలా మంచిది. అలసట, నీరసంతో బాధపడేవారికి తక్షణ శక్తిని ఇస్తుంది. ఎండు ద్రాక్ష మూత్రనాళ ఇన్ఫెక్షన్లతో బాధపడేవారు వీటిని తినడంవల్ల మేలు జరుగుతుంది. అదే ఎండు ద్రాక్షను నెయ్యిలో వేయించి తింటే శరీరానికి రెట్టింపు ప్రయోజనాలు అందుతాయి.

ద్రాక్షపండ్లను ఎండబెట్టినప్పుడు, ఎండుద్రాక్ష తయారవుతుంది. ప్రపంచవ్యాప్తంగా ఉత్పత్తి అయ్యే ద్రాక్షలో 80 శాతం పంటను వైన్ తయారీలో వాడుతారు ఏడు శాతాన్ని ఎండుద్రాక్షగా మిగిలిన, శాతాన్ని మాత్రమే తాజాగా తనడానికి గాని జ్యూస్ తీసివాడుకోవటానికిగాని వాడుతారు. కొన్ని రకాల వ్యాధులు సోకినప్పుడు ఇవి ఉత్తమ ఆహారంగా ఉపయోగపడుతాయి. సంతానంలేని స్త్రీలు కిస్మిస్ పండ్లు తింటే అండాశయములోని లోపాలు తొలిగి సంతానం కలుగుతుంది. యూరినట్లో అమోనియా పెరగకుండా రాళ్లు చేరకుండా కాపాడుతుందని ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు. 200 మిల్లిగ్రాముల పాలతో 50 గ్రాముల కిస్మిస్ హద్లు తినడం వల్ల నరాల బలహీనత, దీర్ఘకాల వ్యాధులు నయమవుతాయి.

ఎండుద్రాక్ష శరీరంలోని శ్వాసనాళికలో పేరుకుపోయిన కఫాన్ని తొలగిస్తుంది. వీటిలో విటమిన్ బి, ఫాస్పరస్ పుష్కలంగా ఉన్నందున వయసుతో సంబంధం లేకుండా ఎవరైనా తీసుకోవచ్చని ఆరోగ్య నిపుణులు అంటున్నారు. ఎండుద్రాక్ష ఎన్నో దీర్ఘ వ్యాధులను నయం చేస్తుంది. ముఖ్యంగా చర్మ సౌందర్యానికి బాగా ఉపయోగపడుతుంది. చాలా మంది వ్యక్తులు అలిసిపోతుంటారు. అలాంటి సమయంలో స్నాక్స్, కెఫిన్ పదార్థాలు తింటారు. వాటికి బదులుగా ఎండుద్రాక్ష తినడం ఉత్తమం అని ఆరోగ్య నిపుణులు సూచిస్తున్నారు. వీటిలో సహజమైన తీపి ఉంటుంది. ఫ్రక్టోజ్, గ్లూకోజ్ ఉంటాయి. శరీరానికి వేగంగా శక్తిని ఇస్తాయి. తరచూ ఎండు ద్రాక్ష తింటుంటే ఎండు ద్రాక్షలో వున్న యాంటీ అక్సిడెంట్లు, ఐరన్ వల్ల అవి తినేవారి చర్మం నిగనిగలాడుతుంది. నల్ల ఎండు ద్రాక్షలో క్యాల్షియం వుంటుంది, అందువల్ల అవి తింటే ఎముకలు దృఢంగా పెళుసు బారకుండా వుంటాయి.

## నల్ల ద్రాక్ష

నల్ల ఎండు ద్రాక్ష కొలెస్ట్రాల్ తగ్గించడంలో సాయపడుతుంది. తద్వారా గుండె ఆరోగ్యానికి మేలు చేస్తుంది. ఉదయాన్నే నానబెట్టిన ఎండుద్రాక్షను తినడం వలన దృష్టి మెరుగవుతుంది. కళ్లు పొడిబారడాన్ని నివారిస్తుంది. రేచీకటి ప్రమాదాన్ని తగ్గిస్తుంది. ఇది జుట్టు మూలాలు, చర్మం బలంగా మారడంలో ప్రయోజనం చేకూరుస్తుంది. వీటిలో విటమిన్లు, ఖనిజాలు, యాంటీ ఆక్సిడెంట్లు, ఫైటో న్యూట్రియెంట్లు, పాలీఫెనాల్స్, డైటరీ ఫైబర్స్, పొటాషియం వంటి పోషకాలు పుష్కలంగా ఉంటాయి. కాబట్టి వీటిని తీసుకోవడం వల్ల అధిక రక్తపోటు కూడా తగ్గుతుంది.

నల్ల ఎండుద్రాక్షలో యాంటీ ఇన్ఫ్లమేటరీ లక్షణాలు ఉన్నాయి. ఇవి వాపును తగ్గించడంలో సహాయ పడతాయి వాపే అనేక ఆరోగ్య పరిస్థితులతో ముడిపడి ఉంటుంది. వీటిలో గుండె జబ్బులు, కేన్సర్, ఆస్టియో ఆర్థరైటిస్ ఉన్నాయి. రక్త శుద్ధీకరణ వల్ల ఎండుద్రాక్ష సహజ యాంటీ ఆక్సిడెంట్లకు మంచి మూలం. వాటి వినియోగం కాలేయం, మూత్రపిండాల పనితీరును వేగవంతం చేస్తుంది. ఇది కాకుండా, ఇది శరీరంలోని ఫ్రీరాడికల్స్‌ను తొలగిస్తుంది. నల్ల ఎండుద్రాక్షలో ఉండే డైటరీ ఫైబర్స్ మన శరీరాలను టాక్సిన్స్, కాలుష్య కారకాలు, ఇతర మలినాలను శుభ్రపరచడంలో సహాయపడతాయి.

**- ఆనంద 'మైత్రేయ'మ్**



## కడియం రక్షణ కవచం

చేతికి ఆభరణంలా కనిపించే ఈ కడియం ఆపదలో ఉన్నప్పుడు అయినవారికి సమాచారం చేరవేసే రక్షణ పరికరంగా కూడా పనిచేస్తుంది. చూడటానికి అందమైన ఆభరణంగా కనిపిస్తున్న ఈ బ్రాస్‌లెట్ స్మార్ట్‌ఫోన్‌కు అనుసంధానమై, యాప్ ద్వారా పనిచేస్తుంది.

ఈజీ రిప్లేసబుల్ 3 వోల్ట్స్ బ్యాటరీతో పనిచేసే ఈ బ్రాస్‌లెట్‌ను, బంగారం, వెండి, రోజ్‌గోల్డ్ మెటీరియల్స్‌తో తయారుచేశారు. మార్కెట్లో వివిధ రంగులు, లెదర్ పట్టీలు, సొగసైన డబుల్ చెయిన్ మోడల్స్‌లో లభిస్తున్నాయి. వీటిలో ఏ మోడల్ అయినా ఎంపిక చేసుకోవచ్చు.

## రోబో డాగ్

పెంపుడు జంతువులంటే ఇష్టం ఉన్న వారు కూడా వాటికి వేళకు ఆహారం, ఆరోగ్యంపై దృష్టి సారించలేక వాటిని పెంచుకోవడానికి వెనుకాడతారు. అయితే ఈ రోబోడాగ్‌తో సమస్యలేవీ ఉండవు. అమెరికన్ రోబోటిక్స్ కంపెనీ రోబోటిక్ కుక్కపిల్లను జెన్నీ పేరుతో రూపొందించింది. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ సాంకేతికతతో తయారు చేసిన ఈ రోబో కుక్కపిల్ల బ్యాటరీలతో పనిచేస్తుంది. ఇందులోని టచ్ సెన్సర్స్ సాయంతో ఇది అచ్చం నిజమైన కుక్కపిల్లలాగానే స్పందిస్తుంది. దీన్ని చూసిన వారు ఇదొక రోబో అన్న విషయమే గుర్తించలేరు. ఇళ్లల్లో శిక్షణ పొందిన పెంపుడు కుక్కపిల్లల మాదిరిగానే ఈ రోబోటిక్ కుక్కపిల్ల షేక్ హ్యాండ్ ఇవ్వడం, ఎగరడం, కాళ్లపై కూర్చోవడం వంటి పనులన్నీ చేస్తుంది. దీనిని స్మార్ట్ యాప్ సాయంతో నియంత్రించుకోవచ్చు.



## క్యాండిలైట్ విందు



చిన్న చిన్న హోటళ్లు, రెస్టారెంట్లలోనూ మిరమిట్లు గొలిపే షాండ్లియర్లూ, ఆకర్షణీయమైన విద్యుత్ దీపాలు అతిథులకు స్వాగతం పలుకుతుంటాయి. అయితే రాజస్థాన్‌లోని లీలా మహల్ ప్యాలెస్‌లో ఉన్న మోహన్ మహల్‌లో చిత్రమైన అనుభూతి సొంతమవుతుంది. ఈ రెస్టారెంట్‌లో ఎక్కడా విద్యుత్ దీపాలు ఉండవు. ఏ మూల చూసినా కొవ్వొత్తుల కాంతులే కనిపిస్తాయి. టేబుల్‌పైనా, గోడల్లో, అరల్లో స్టాండ్లకు అందంగా అమర్చిన క్యాండిళ్ల సువాసనలను వెదజల్లుతూ వెలుగుతుంటాయి. ఎటు చూసినా రాజసం ఉట్టిపడే ఈ హోటల్‌లో రోజుకు కొన్ని వేల కొవ్వొత్తులను వినియోగిస్తారు.

ఈ మహల్‌లోని గోడలను అద్దాలతో డిజైన్ చేయడం వల్ల కొవ్వొత్తుల కాంతి వాటిలో ప్రతిబింబించి ఆ ప్రదేశం మరింత అందంగా వెలిగిపోతుంది. దేశంలోనే జీరో ఎలక్ట్రిసిటీతో నడిచే హోటల్‌గా ఈ మహల్ ప్రత్యేకతను సొంతం చేసుకుంది.

## ఔరా రింగ్ జెన్3

హెల్త్ ట్రాకర్లు చాలావరకు అన్ని ఆభరణాల రూపాల్లోనూ వచ్చేసినట్లు, అనేక రకాల స్లీప్ ట్రాకర్లు కూడా లభిస్తున్నాయి. వేలికి ధరించే ఈ ఔరా



రింగ్ జెన్3 నిద్ర వ్యవధి, నాణ్యతను ట్రాక్ చేస్తుంది. వీటితో పాటు హృదయ స్పందన, శ్వాస విధానాలు, శరీర కదలికలను కూడా పర్యవేక్షించి, స్లీప్ ఫిట్‌నెస్ స్కోర్‌ను ఇస్తుంది.

దీనిని మొబైల్‌కు అనుసంధానం చేసుకుని, యాప్ సాయంతో ఉపయోగించుకోవచ్చు.

కథ

# నాన్న కానవస్తున్నాడు

వడలి రాధాకృష్ణ

"అసలు ఏమనుకుంటున్నావే? ఆపుతావా ఇక! అమ్మవయినా నీకు అంతే లేకుండా ఉంది" మాలతి ఎంత అడ్డుకుంటున్నా ఆమెను ఆపలేక పోతోంది.

"పెరట్లో కట్రాటకి కట్టేసిన పొట్లగిత్తకూ, పెంకుటింటిలో పెల్లుబికిబోతున్న గౌరమ్మకు పెద్ద తేడా ఏమి లేదేమో!"

"ఉండదే అక్కా! అమ్మంటే ఎవరనుకున్నావు? అమ్మోరు కదూ!" మయూరి పెద్దక్కను భుజం తట్టి మరీ వెనకేసుకొస్తోంది.

"చిన్నక్క మాట్లాడదేమిటి!" మయూరి మణి కళ్లలోకి సూటిగా చూపుల బాణాలను సంధిస్తూ పలికింది.

"నాకు పెద్ద చెల్లెలు.. అదే మణి అనే ఈ అమ్మాయి నిఖార్సయిన అమ్మకూచి. అందుకే దీని బుర్రలోను, ఒంటిలోను గౌరి అమ్మ తప్ప ఏమీ ఉండదు. అందుకే అమ్మ ఏమి వాగుతున్నా ఉలకదంతే!" కోర్టులో వాదిస్తున్న ఆడ ప్లీడర్‌లాగ ఉంది మాలతి వరస.

"అయితే పలికేది, పలికించేది మనమేనంటావా?"

"నోరు ముయ్యండెహే! నేను అమ్మకూచినే, కానీ ఇలాగ దుమ్మెత్తి పోయడాలను, కంకర ఎత్తి గుమ్మరించడాలను ఈ మణి సహించదు. ఆ పైన పోత్సహించదు కూడాను."


ఆ మాటలు మెత్తని రాతిదెబ్బల్లాగ ఉన్నాయి.

"పెద్దది. అమ్మను నువ్వా పోత్సహించేది?"

"అమ్మ మన ముగ్గురి బాధ్యత."

"నాన్న కూడా మన బాధ్యతే కదూ!!"

"అందుకే ఇన్నిన్ని మాటలు"



"ఏంటే? ఇందాకటి నుండి చూస్తున్నాను. పట్నాల నుండి పండగలకని ఎగరేసుకుంటూ పుట్టింటికి వచ్చారు. వచ్చినోళ్ళు ఉన్నన్నాళ్లు గమ్మునుండి పోవాలిగానీ పుట్టింట్లో పొగ బెడతారా!" గౌరమ్మ మాటలు బిరుసుగా ఉన్నాయి.

అంతేనా!? గుర్రుగాను అన్పిస్తున్నాయి.

చిన్నప్పుడయితే తన ముగ్గురు పిల్లల్ని గౌరమ్మ ఎంతో గారాబం చేసేది. కానీ ఇప్పుడు తనంతటి వాళ్ళయిపోయారు.

"నీ కన్నా నాన్న నయం"

మయూరి అమ్మ మాటలకు సమాధానమవుతూ ఉంది.

"అవునే! నేను గారం చేయను. ఆయనగారు గారం చేసి పిల్లల్ని నెత్తికెక్కించుకుంటాడనే నా అక్కసంతాను!!"

"అక్కసెందుకే అమ్మా, తాళి కట్టినోడు నీకు తోడుగా నిలుస్తున్న నాన్నను పట్టుకొని ఎడాపెడా ఆడిపోసుకోవడం ఎంతవరకు సబబు?"

మాలతి నిత్యం విరుచుకుపడిబోతూన్న తల్లిని నిలువరిస్తూ ఉంది.

"పాపం అమాయక చక్రవర్తి నాన్న. ఈవిడను ఎలా భరిస్తున్నాడో!!"

"భార్య అనేది భరించాల్సిన బ్రహ్మ పదార్థమట. ఏదో పుస్తకంలో చదివాను. మణి అక్కా చెల్లెళ్ల వాదనలకు మసాలాలద్దుతూ అంది.

"కుచేలరావు అంకుల్ గారిల్లు చూడు.. ఆంటీ నోరెత్తదు. అది భర్త మీద బాధ్యతో లేక భయమో! ఆ విషయం మనకు అనవసరం అనుకో!!"

"ఇక్కడ మనిల్లూ ఉంది.. దేవుడు లాంటి నాన్న మీద అమ్మ అలాగ విరుచుకుపడిపోవడం! ఇది నిత్య సత్యమయిపోతూ ఉంది."

"ఏమిటే! వచ్చినప్పటి నుండి చూస్తున్నాను. ఎప్పుడూ అమ్మను ఆడిపోసుకుపోవడమేనా!!" కూతురు మీద అంతెత్తున లేచింది గౌరమ్మ.

"నువ్వు ఒకరి మీద ఆడిపోసుకుంటే నీ మీద ఎగరడానికి వెనుక మరొకరు ఉంటారు మమ్మీ!"

"నా వెనుక ఒక్కరు కాదు, ముగ్గురు ముదురు మొహాలున్నాయి."

బజారు నుండి అప్పుడే వచ్చిన వీరేశ్వరం విషయం అర్థంకాక తల పట్టుకున్నాడు.

"అలా తలలు పట్టుకోవడం తప్ప విషయం మీకు ఏమి బోధపడుతుంది కనుక. ఏ బరువైనా మోసేవాళ్లకి తెలుస్తుంది!" మొగుడి మీద విరుచుకుపడింది గౌరమ్మ.

"నువ్వు చెప్పిన సామాన్ల బరువును బజారు నుండి మోసుకొచ్చినానా లేదా? ఆ ఆయాసం ఇంకా తగ్గనే లేదు అప్పుడే పొగ బాణాలు మొదలయిపోయాయి"

"నాన్న కెవ్వుకేక.."

మయూరి తండ్రిని వెనకేసుకొస్తూ ఉంది.

"కేకలకు, కూతలకు ఇంట్లో కొదవేమీ లేదు. అయినా పిల్లలు పండక్కి వచ్చే లోపల కావాల్సి న సరుకులు తెచ్చిపారేయవయ్యా సామీ! అని పది రోజుల నుండి మొత్తుకుంటున్నాను. వినే రకమా తమరు."

.................

"ఇంట్లో వండి పడేసిన ముద్దను తేరగా తిని పారేయడం తరువాత తిథులను, ఘడియలను లెక్కలు పెడుతూ కుర్చోవడం.." గౌరమ్మ పెనిమిటిని ఖాతరు చేయడం లేదు. ప్రతిసారీ నొచ్చుకోవడం వీరేశ్వరం వంతు అవుతూ ఉంది. చెప్పాలంటే ఈ సాధింపులను భరించలేకుండా ఉన్నాడు.

"పండక్కి పిల్లలు వస్తున్నారని అవి కావాలి, ఇవి కావాలి అంటూ చేంతాడంత లిస్టు రాసి తన మొహాన పడేసింది. ఉదయం తెస్తావా సాయంత్రం తీసుకొస్తావా?" అంటూ నిలువనీయడం లేదు. ప్రతిసారీ నెలఖారు రోజున పింఛను డబ్బు తన ఎకౌంటులో పడుతుంది. ఇప్పుడు ఆరో తారీఖు వచ్చింది."

"పండగకు పిల్లలు ఇంటికొచ్చారు. వాళ్ళ తిరుగు ప్రయాణ టికెట్స్ గురించి అస్సలు ఆలోచించారా? అది కూడా నేనే చెప్పాలి. బాధ్యత లేని తిరగమోత మనిషి. నేను ఆయాసం తెచ్చుకొని అరవడమేగాని మీకంటూ అస్సలు చీమ కుట్టదు.."

"చీమ కుట్టకపోవడమేమిటి? రోజూ గండుదోమలు కుడుతుంటేను. మణి తన వంతుగా తల్లి మీద ధ్వజమెత్తుతూ ఉంది.

"అయినా మా ప్రయాణాలు మాకు తెలుసు. మా టికెట్స్ మేం చూసుకుంటాం."

గౌరమ్మ వదలడం లేదు. ప్రతి విషయంలోను మొగుడిని జొప్పించి వీరేశ్వరం మీద ఎగిరెగిరి పడిపోతోంది. భార్య మీద తనకున్న బాధ్యత అయితేనేమీ.. పిల్లలు పండక్కి వచ్చారు వాళ్ళ ముందు తాను అతిగా మాట్లాడకూడదన్న ఉద్దేశం అయితేనేమీ వీరేశ్వరం మౌనాన్ని సమాధానంగా చెబుతూ ఉన్నాడు.

"అమ్మా, నాన్నంటే ఏమనుకుంటున్నావు? ఆయన సంపాదన మీద నువ్వు బతికేదానవు. పోనీ.. పుట్టింటి నుండి నీకేమైనా ఎస్టేట్లు వచ్చాయా చెప్పు. దేన్నీ చూసుకొని ప్రతిసారీ నాన్న మీద ఎగిరెగిరి పడుతున్నావు" మాలతి మాట వీరేశ్వరానికి ఆశ్చర్యంగా అన్పిస్తూ ఉంది. ఆవేశం, ఆక్రందనాలు కలగలిసి తనలో కొత్త క్రమాన్ని ప్రోది చేస్తున్నాయి.

"మాలతీ!" పెద్ద కూతుర్ని వారింపబోయాడు.

"అవును నాన్నా. నువ్వే లేకపోతే ఈమె ఎక్కడుండేది చెప్పు? ఎంత పేదరికం నుండి వచ్చిన మనిషి ఈవిడ? నిన్ను కట్టుకున్న తర్వాత ఎన్ని వెసులు బాట్లు సాధింపగల్గింది. అటువంటిది కట్టుకున్న భర్త అన్న కనీస ఇంగిత జ్ఞానం లేకుండా పొగరుగా ఉండటం, కారణం లేకుండా విరుచుకు పడిపోవడం ఏమీ బాగాలేదు."

"ఇది పొగరు కాదే! ఆయన మీద, మీ మీద, ఈ కుటుంబం మీద నాకున్న బాధ్యత" గౌరమ్మ స్వరం అరుపులాగ ఉంది.

అంతే! ఆక్రోశంతో ఊగిపోయింది.

"బాధ్యతా లేదు, బీరకాయా లేదు. ఇంత వయసు వచ్చాక నీకంటూ కొంత పరిణితి ఉండాలి. అంత ఇదిగా విరుచుకు పడిపోవడానికి నీకు మనుషులు కావాలంటే, నీ కడుపున పుట్టినవాళ్లం, నీ చేతికింద మేం

"నాన్న కెవ్వుకేక.."
మయూరి తండ్రిని వెనకేసుకొస్తూ ఉంది.
"కేకలకు, కూతలకు ఇంట్లో కొదవేమీ లేదు" అయినా పిల్లలు పండక్కి వచ్చే లోపల కావాల్సిన సరుకులు తెచ్చిపారేయవయ్యా సామీ! అని పది రోజుల నుండి మొత్తుకుంటున్నాను. వినే రకమా తమరు."

ముగ్గురున్నాం."

ఆ క్షణంలో తమ పిల్లలు ముగ్గురూ గొప్ప జ్ఞానులులాగ అన్పిస్తూ వీరేశ్వరానికి.

వారు ఆడపిల్లలు కాదు.. పెళ్లిళ్లు చేసుకొని మొగుళ్లతో కాపురాలు చేసుకుంటున్న ఈడపిల్లలే. ఈడ పిల్లలందరూ తనకు దన్నుగా ఉంటున్నారు.

వీరేశ్వరం ఆలోచిస్తున్నాడు.. మథన పడుతున్నాడు. ఆక్రోశాన్ని దిగమింగుకుంటున్నాడు.

గౌరమ్మ తన భార్య. ఉద్యోగమంటూ తను ఊరూర తిరిగినా కుటుంబ బాధ్యతను మీద వేసుకొని సాకిన మనిషి. ఆనాడు అత్తా మామల బాగోగులు చూసింది. ఇక్కడ తన అమ్మా నాన్నలకు ఎంతో సేవ చేసింది.

తర్వాత అనివార్యంగా పుట్టిన పిల్లలు. వారి పెంపకం, తదనంతరం వారి చదువులు, పెళ్లిళ్లు ఉద్యోగమంటూ తానెంత కష్టపడినా ఇంటిపాత్రను సమర్థవంతంగా పోషిస్తూనే ఉంది. ఈ క్రమంలో కొన్ని కొన్ని ఆవేశపూరిత సందర్భాలను తట్టుకోవడాని ప్రయత్నిస్తూ ఉన్నాడు.

కానీ వయసురీత్యా వాటిని తట్టుకోవడం ఈ మధ్యన ఆయనకు కష్టంగానే అన్పిస్తూ ఉంది. అవును.. పింఛను డబ్బు చేతిలో పడేవరకు ఇంటి సరుకుల్ని తేలేని మధ్య తరగతి బతుకు తనది. ముగ్గురు ఆడపిల్లల్ని కష్టపడి చదివించాడు. పట్టుదలతో మంచి ప్రయోజకుల్ని చేశాడు.

అందులో గౌరమ్మ పాత్ర అపారం. అలాగని తనని ఇప్పుడు కూరలోని కరివేపాకులాగ తీసివేయడం భరింపలేకుండా ఉన్నాడు. లోలోపల మథన పడుతూ ఉన్నాడు.

ఇది వీరేశ్వరానికి ఎలా ఉన్నా కన్న కూతుళ్ల ముగ్గురికీ ఏమాత్రం నచ్చటం లేదు. అందుకే నాన్నను సమాయత్తపర్చడాన్ని ప్రయత్నిస్తూ ఉన్నారు. గౌరమ్మ ధోరణి రోజు రోజుకీ రోతగా మారుతూ ఉంది.

కూతుళ్ల ముగ్గురి కన్పించడం లేదు.. అదే నాన్న అనే మనిషిలో కానరావడం లేదు. తమ చిన్నతనంలో నాన్న ఎలాగ ఉండేవాడు? తెలిసీ తెలియని వయసులో స్కూలుకి వెళ్లమని మొండికేస్తే మొదట్లో బుజ్జగించేవాడు. బాగా చదువుకోమని హితబోధ చేసేవాడు. స్కూలులో చక్కగా చదువుకొని ఆటపాటలలో పాల్గొనాలని ప్రేమగా చెప్పి చూసేవాడు కానీ నాన్న మాటలు ఒంట పట్టేవి కావు.

ఆ స్థితిలో వీరేశ్వరానికి బెత్తాన్ని చేతిలోకి తీసుకోక తప్పేది కాదు.

ఒకటి రెండు సార్లు స్కూలుకి వెళ్ళమని మొండికేస్తే బెత్తంతో చితకబాదేశాడు. మార్కులు బాగా తెచ్చుకోవాలని హెచ్చరించేవాడు. మార్కులు రాకపోతే ఇంటి ముందున్న కరెంటు స్తంభానికి కట్టి కొట్టేవాడు.

అప్పటి నుండి ముగ్గురు ముగ్గురే అయిపోయారు. కష్టపడి చదువుకున్నారు. మంచి మార్కులు సంపాదించుకున్నారు. చెప్పాలంటే ఒక్కసారిగా 'స్కూల్ టాపర్స్' అయిపోయారు.

ఆ తర్వాత గొప్ప గొప్ప ఉద్యోగాలలో బాగా స్థిరపడిపోయారు. ఆ రోజుల్లో వీరేశ్వరం గారి ముగ్గురు ఆడపిల్లలు మంచి తెలివయినవాళ్లు అని చుట్టుపక్క ప్రాంతంలో మార్మోగిపోయింది.

మాలతికి విషయం అర్థమవుతూ ఉంది. మయూరికి నవ్వు వచ్చింది... "అక్కా! అప్పట్లో నాన్న మనల్ని చితకబాదిన 'పేకబెత్తం' నడుమ ఇంటి భోషాణంలో ఉన్నట్లు గుర్తు. దాన్ని మరోసారి బయటకు తీయాల్సిన అవసరం ఉన్నట్లుంది.. ఇది మయూరి సలహా.

**"అక్కా! ఇందాక నడుమ ఇంటి భోషాణాన్ని వెతికాను. ఇదే ఆనాడు నాన్న మనపై వాడిన పేక బెత్తం" మయూరికి ఉద్వేగంగా ఏమీ లేదు.**

"అవునే! దాన్ని మన పూజా మందిరంలో పెట్టుకొని పూజించాలి. అదే లేకపోతే మనం ఈరోజు ఇంత పెద్ద చదువులు చదివి, ఇన్నేసి లక్షల రూపాయిల జీతాన్ని తీసుకునేవాళ్లం కాదేమో! అందుకే ఆ పేకబెత్తం మనకు దేముడితో సమానం.

అక్కా చెల్లెళ్ళకు నవ్వు ఆగడం లేదు.. ఆ నవ్వులు పువ్వులవుతూ మనసు వెన్నెలలో మమేకమవుతూ ఉన్నాయి.

తల్లికి చెప్పి చూస్తున్నారు.. నాన్నతో తీరువుగా ఉండాలని కోరుతున్నారు. లేకపోతే తండ్రిని తమతో తీసుకుపోగలమని హెచ్చరికలు జారీ చేస్తున్నారు.

"ఈవిడ అస్సలు వినే రకం కాదు. దురుసునోరు ఈమెను పూర్తిగా మింగేస్తూ ఉంది. తప్పదు నాన్న ఆపని చేయాల్సిందే ఇప్పటికే తప్పదు నాన్న, ఆ పని చేయాల్సిందే! ఇప్పటికే ఆయన చాల ఆలస్యం చేశాడు. మణి తనలోని భావాలను బయట పెడుతూ ఉంది.

చేతులు కాలాక తమలపాకుల పసరు రాసుకుంటాననటే ఎట్లా?"

మాలతి చెల్లెలు నిర్ణయాన్ని సమర్థిస్తూ ఉంది.

"అక్కా! ఇందాక నడుమ ఇంటి భోషాణాన్ని వెతికాను. ఇదే ఆనాడు నాన్న మనపై వాడిన పేక బెత్తం" మయూరికి ఉద్వేగంగా ఏమీ లేదు. బాధ్యత నిండిన ఆలోచన తనది.

"నాన్నా, ఇప్పుడు దసరా సెలవులయిపోయాయి. మళ్లీ సంక్రాంతికి వస్తాం. ఇదిగో! మమ్మల్ని మంచిగా నిలబెట్టిన పేక బెత్తం. దీనికి నువ్వు మళ్లీ పని చెప్పాలి ఉంది. జన్మనిచ్చిన తండ్రికి కన్నకూతురు ఇటువంటి సలహాలు ఇవ్వాల్సింది కాదు. కానీ ఇస్తున్నాం ఈ విషయంలో మమ్మల్ని తప్పు పట్టకుండా ముగ్గుర్నీ మన్నించాలి.

"అమ్మ మారాలి! దాని కోసం నాన్నగా మీరు కావాలి. మీరు అదృశ్యమైపోయి అనక అంతర్ధానం కారాదు!! ఇది మా కోరిక"

ముగ్గురు కూతుళ్ల ముక్త కంఠంతో ఒకటయి తన చేతిలో పెట్టిన పేకబెత్తం బాధ్యత వీరేశ్వరాన్ని విస్మయపరుస్తూ ఉంది. తాము దసరాకు వచ్చి వెళ్ళిన పది రోజుల తరువాత తమ ఫ్యామిలీ వాట్సాప్ గ్రూపులో వీరేశ్వరం ఒక వార్తను పోస్టు చేశాడు...

"డన్.. మీ నాన్న అదృశ్యమైపోలేదు, కానవస్తున్నాడు. అవసరమైతే ఈ పేకబెత్తం సాక్షిగా మరల మరల కానవస్తూనే ఉంటాడు. ఓ పక్కన ఆ మాట తమకు బాధను కలిగించినా ఇప్పుడు చదవడానికి ఎంతో హాయిగా అన్పిస్తూ ఉంది.

సంక్రాంతి పండగకి పుట్టింటికొచ్చిన మాలతి, మణి, మయూరిలకు గతం చెరిగిపోయినట్లుంది. వర్తమానం ఘనంగా అన్పిస్తూ ఉంది.

గౌరమ్మ గౌరమ్మ లాగానే భర్తకు ప్రేమను పంచుతూ ఉంది, ఆయన గారిని పల్లెత్తు మాట అనడం లేదు. పైగా ప్రేమ నిండిన పంచ్ డైలాగ్‌లతో వీరేశ్వరాన్ని మురిపిస్తూ ఉంది. భార్య ధోరణిలో వచ్చిన మార్పు ఆయనకు హాయిగా అన్పిస్తూ ఉంది.

కూతుళ్లు ఇచ్చిన పేక బెత్తాన్ని తిరిగి వాళ్లకే అప్పగిస్తూ నెమ్మదిగా పెదవి విప్పాడు "అవును.. అమ్మాయిలూ! మీ నాన్న కానవచ్చాడు!

అదే అ ముగ్గురు కూతుళ్లకీ కావాల్సింది.

■

## రచనలకు ఆహ్వానం

**రచయితల నుండి కథలు, కవితలు, సమకాలీన వ్యాసాలు స్వాగతిస్తున్నాం. రచనలతో పాటు మీ పేరు, చిరునామా, హామీపత్రం తప్పనిసరిగా జత చేయాలి. ఎంపిక కాని రచనలు తిప్పి పంపగోరేవారు తగిన పోస్టేజీ జత చేసిన కవరు పంపించాలి. ఇతర పత్రికల పరిశీలనలో ఉన్న రచనలు దయచేసి పంపించకండి. రచనలు పంపించాల్సిన చిరునామా: ఎడిటర్, ఆదివారం వార్త, నం.396, లోయర్ ట్యాంక్ బండ్, డిబిఆర్ మిల్స్ పక్కన, హైదరాబాద్-80.**

**sunmagvaartha@gmail.com**

# ప్రాచీన ఆంధ్రభాషా ప్రశంస

**క్రీస్తు పూర్వం** 3వ శతాబ్దానికి చెందిన శాతవాహన రాజుల కాలం నుండి తెలుగు ప్రజలకు ఒక విశిష్టమైన చరిత్ర ఉంది. బౌద్ధ పూర్వ యుగం నుంచి, బ్రిటిష్ సామ్రాజ్య పరిపాలనలో తెలుగువారు పెద్ద ఎత్తున ప్రపంచం నలుమూలలకు వలస వెళ్లారు. తెలుగు భాష, సంస్కృతి సంప్రదాయాలు ఆయా జాతీయ జీవన విధానాలతో మేళవించినందున తెలుగు జగద్విఖ్యాతి పొందుతోంది. క్రీ.పూ. 500 నాటి ఐతరేయ బ్రాహ్మణమ్, విశ్వామిత్రుడు తన ఆజ్ఞను ఉల్లంఘించిన యాభై మంది కుమారులను ఆర్యభూములకు ఆవల నివసించమని శపించిన వారిలో ఆంధ్రులు దక్షిణా పథంలో స్థిరపడిన వివరం పేర్కొన్నారు. శ్రీమద్రామాయణ యుగంలో శ్రీరామ లక్ష్మణులు, దండకారణ్య గమన సందర్భంలో ఆంధ్రదేశ ప్రస్తావన వుంది. సంస్కృత మహాభారతంలో సభాపర్వంలో ఆంధ్రదేశపు ఉనికి చెప్పబడింది. ఆంధ్రులు మహాభారత సంగ్రామంలో కౌరవుల పక్షాన పోరాడినట్లు భీష్మ, ద్రోణ, కర్ణ పర్వాలలో చెప్పబడింది. పురాణాలకు సంబంధించి మార్కండేయ, బ్రహ్మాండ, వాయు, భాగవత పురాణాలలో ఆంధ్ర దేశ ప్రసక్తి ఉంది. ఆంధ్ర వంశంలో, 30 మంది రాజులు 456 సంవత్సరాలు పాలించారని పేర్కొనబడింది. దక్షిణా పథ రాజ్యాలలో ఆంధ్రరాజ్య ప్రస్తావన భరతుని నాట్యశాస్త్రం, బృహత్సంహిత, అశోక చక్రవర్తి ధర్మలిపి శాసనాలలో ఉంది. ఆంధ్రులు బౌద్ధధర్మం అవలంబించారని గిర్నర్, షాహబాజ్‌గర్, కాల్సీ ధర్మలిపి శాసనాలు చెప్పాయి. దేశనామావళి, శక్తి సంగమ తంత్రమ్, శబ్ద కల్పద్రుమమ్‌లో పూరీ జగన్నాథం ఉత్తరాన, శ్రీశైలం మధ్యన, దక్షిణాన చోళదేశం తెలుగు దేశానికి ఎల్లలు అని ఉంది. శివస్కంధవర్మ-మైదవోలు, నందివర్మ ముడియనూరురుగా శాసనాలలో క్రీ.పూ.3,4 శతాబ్దాల నాటికి ఆంధ్రపథం, ఆంధ్రమండలం పేర్కొనబడింది. 6వ శతాబ్ది నాటికి విష్ణు కుండినులు ఆంధ్రదేశాన్ని పాలించారని తెలుస్తోంది. వాట్టర్స్, యూన్ చ్వాంగ్ బౌద్ధ సంఘారామాలు, 3000 మతాచార్యులు ఉన్నారని రాజధాని పిం..కి...లో(వేంగి) పెద్ద చైత్యం ఉండేదని తెలుస్తోంది. ఆంధ్ర రాజులు చైనా దేశంతో ఎక్కువ సంబంధం కలిగి వుండేవారు. దండి-దశ కుమార చరిత్ర 7వ శతాబ్ది ఆంధ్రనగరం- వేంగి, సమీపంలోని కొల్లేరు సరస్సు వివరించింది. 1194లో మహానుభావ పంత్‌కి చెందిన చక్రధరుడు తెలుగు, కన్నడ, మహారాష్ట్ర దేశాలకు వెళ్లవద్దని ప్రబోధించిన చారిత్రక వృత్తాంతం ఉంది. కల్హణుడు రాజతరంగిణిలోని ఏడు తరంగాలను గోదావరి నది సప్త పాయలతో పోల్చాడు.



కంబరామాయణం అరణ్యకాండలో 15వ శతాబ్దం నాటికి విజయనగర సామ్రాజ్య వైభవం, వర్తక వాణిజ్య సంపన్నత అబ్దుల్ రజాక్, బార్బొసా వంటి చరిత్రకారులు వివరించారు. బంగాళాఖాత సముద్ర తీరంలోని మచిలీపట్నం వంటి రేవు పట్టణాల నుండి, చైనా మక్కా, హర్మజ్, మడగాస్కర్, సుమత్రా, మనిలా దేశాలకు, దీవులకు సముద్రయానం ఓడలు సుప్రసిద్ధి, పొందింది. 12,13 శతాబ్దాలలో కాకతీయుల కాలం ఆంధ్రవైభవానికి స్వర్ణఘట్టం. ఆంధ్ర పౌరుషం, వీరత్వం, జగత్ప్రసిద్ధి పొందాయి. ఏకచ్ఛత్రాధిపత్యం ఆరంభమైంది. రాజశేఖరుని కావ్య మీమాంసలో ఆంధ్రదేశ ప్రకృతి వర్ణనలో మలయమారుతం ఆంధ్రస్త్రీల కొప్పులు విడిపోయేటట్టుగా వీస్తోంది అని పేర్కొనబడింది. ఆంధ్ర స్త్రీవచో మాధుర్యం సంస్కృత కవుల చాటువులలో సదుక్తి కర్ణామృతం సంస్కృత గ్రంథాలలో పేర్కొన్నారు. పంప మహాకవి జైనుల ప్రథమ తీర్థంకరుడైన భరతుని చరిత్ర ఆది పురాణంలో ఆంధ్రులు విలుకాండ్రుగా ఉండేవారని తెలుస్తోంది. తెనుగు ప్రజలు ఆజానుబాహులు, తమిళుల కంటే అందమైనవారు ఆచారవంతులు, శక్తిమంతులు కానీ ఆవేశపూరితులు అని భారతదేశ ప్రాచీన దక్షిణ, ఆసియా విజ్ఞాన కోశం 1885లో పేర్కొంది.

తెలుగు భాష మాధుర్యం గురించి పాశ్చాత్యులు ప్రశంసించిన వివరాలు ఎన్నో ఉన్నాయి. తైలంగా, తెలింగా, తిలాంగ్, తెలుగుజాతి భాషకి, లిపిగా ప్రశంసలు పొందింది. అల్‌బెర్ని, జె.డి. యాండర్సన్, విలియమ్ కేరీ, ఎడి. క్యాంప్ బెల్, రాబర్ట్ కాల్డ్ వెల్, హెన్రీ మోరిస్, సి.పి.బ్రౌన్, జె.బి.ఎస్ హాల్డేన్, ఫెర్గుసన్, ఫోరర్, మార్కోపోలో, నిలో కాంటి, వాల్టేరు, బెర్నియర్.. ఇలా ఎందరో వేనోళ్ల ప్రశంసించారు. 1975 ప్రపంచ తెలుగు మహాసభల సందర్భంలో, ఆంధ్రసదుక్తి కర్ణామృతం పేరిట ఆంధ్రులను గురించి, తెలుగువారి సాంస్కృతిక జీవన విధానాన్ని గురించి ఆంధ్రేతరులు చెప్పిన ప్రశంసా వాక్యాలు కూర్చిన వివరణను ఎన్. సుందరేశ్వరరావు, ఎన్ శ్రీకృష్ణమూర్తి అందచేసారు. సాహితీ చరిత్రలో అప్పయ దీక్షితుల వారి ప్రశంస మకుటాయమైనదిగా ప్రసిద్ధి పొందింది.

"ఆంధ్రత్వ మాంధ్ర భాషాచ / ప్రాభాకర పరిశ్రమః
తత్రాపి యాజుషీశాఖా / నాల్పస్య తపసఃఫలమ్"

ఆంధ్రునిగా పుట్టడమే తపఃఫలంగా భావించిన ఘనత తెలుగు మాట్లాడే జనావళికి జన్మ సుకృతంగా భావించబడింది. భారతీయ భాషలన్నింటిలో తెలుగు అన్య దేశా భాషా పదాలను అత్యంత తేలికగా తనలో కలుపుకోగల సౌలభ్యంగల భాషగా గుర్తించారు. సహజంగా శ్రవణానందకరంగా తెలుగు ఔదార్యంతో అన్ని భాషలను స్వీకరిస్తుంది.

జె.బి.యస్ హాల్డేన్ మన మాతృభాషను గురించి "సంకుచితత్వం లేని భాషగా ఎప్పటికైనా సైన్స్, వైద్యం, ఇంజినీరింగ్ సాంకేతిక బోధనలకు సంబంధించి హిందీకి ప్రతిస్పర్థిగా తెలుగు ఒక్కటే నిలబడగలదు" అన్నారు.

**- జయసూర్య**

## విలువలకు ప్రతిబింబం



డా॥ పుట్టపర్తి నాగపద్మిని, అయ్యకు అక్షర హారతిగా సరస్వతీ పుత్రుని పుత్రికగా, వెలువరించిన పుట్టపర్తి రచనలలో భారతీయ సంస్కృతి 'అద్భుతమైన పరిశోధనాత్మక సంస్కృతీ మహోన్నత వైభవ దీప్తి ప్రసరింపచేస్తోంది. నాలుగు అధ్యాయాలలో డా॥ నాగపద్మిని, సరస్వతీ పుత్రుడైన సాహితీ తపస్వి అశేష శేముషీ వైభవాన్ని ఆవిష్కరించి, వారి దివ్యాత్మను సాక్షాత్కరింపచేసారు. జీవిత నేపథ్యం, సంస్కృతీ సహవాస సాంగత్యం ఆ సర్వోన్నత సాహితీ స్రష్టను ఎల్లా పరిపూర్ణ యశస్విగా అడుగులు వేయించిందీ, భారతీయ సంస్కృతీ కాణాచిగా తీర్చిదిద్దిన విలువలను ఈ గ్రంథం ప్రతిబింబింపచేస్తోంది. చిన్ననాటి నుండి తండ్రిగా ఆత్మీయ సాన్నిహిత్య వ్యక్తిత్వం వలన ప్రభావితురాలైన వారసత్వ విదుషీమణి డా॥ నాగ పద్మిని ఈ సిద్ధాంత గ్రంథాన్ని వెలువరించి, తెలుగు జాతికి భారతీయ సంస్కృతీ పట్టుకొమ్మలైన రచనలు అందించిన సాహితీ మహామేరువును ఆరాధ్యనీయునిగా కీర్తింపచేసారు. పుట్టపర్తి జీవితంలోని ముఖ్య ఘట్టాల ఛాయా చిత్రాలు గ్రంథానికి నిండుదనం చేకూర్చాయి. ఎవరికీ తెలియని బాల్య, యౌవన విశేషాలను, కథా కథన శైలిలో రచయిత్రి ప్రతిభావంతంగా వివరించారు. పుట్టపర్తి అగ్రశ్రేణి బహుముఖీన సువిఖ్యాత పండితోత్తమునిగా, సాహితీ మూర్తిగా, 14 భాషల బహు భాషా పాండిత్య, కవిత్వ, ఆధ్యాత్మిక తత్వవేత్తగా భారతీయ మహోన్నత సంస్కృతి ఎల్లా భారతీయ ఆత్మను వెలికితీసే బృహత్ విశ్వరూపాన్ని డా॥ నాగపద్మిని సాక్షాత్కరింపచేసారు.

**(పుట్టపర్తి రచనలలో భారతీయ సంస్కృతి-రచన: డా॥ శ్రీమతి పుట్టపర్తి నాగపద్మిని, వెల: రూ.250/-; ప్రతులకు: డా॥ నాగపద్మిని, ప్లాట్ నం.37, వంశీ నిలయం, తరుణ అవెన్యూ, లక్ష్మీనగర్ కాలనీ ఈస్ట్ ఆనందబాగ్, మల్కాజిగిరి, హైదరాబాద్-47)**

**- యర్రమిల్లి**

## అమూల్యమైన రచన

మానవ సమాజానికి శాస్త్రవేత్తలు వెన్నెముక లాంటివారు. వీరి పరిశోధనలు ఎనలేని సేవలందిస్తూ, జీవితాలను మెరుగు పరిచేందుకు ఎంతగానో తోడ్పడుతాయి.

శ్రీమతి టి.శాంతాదేవి జీవశాస్త్ర అధ్యాపకురాలు. దైవ శాస్త్రాన్నీ ఔపోసన పట్టినవారు. వృత్తి, ఆసక్తి, అధ్యయనశీలత వీరు గొప్ప రచయిత్రిగా ఎదగటానికి దోహదపడ్డాయి. భారత భాగవతాలు మనిషి జీవితాన్ని చక్కదిద్దుకునే మహత్తర అవకాశాన్ని కల్పిస్తుందని గాఢంగా విశ్వసిస్తారు. మొక్కగా ఉన్న దశలోనే చిన్నారులను చక్కదిద్దాలని వారి గురించి ఎన్నో సైన్సు సంబంధిత రచనలు చేసారు. భారత భాగవత పద్యాల్లోని మందార మకరందం లాంటి పద్యాలను ఏర్చి కూర్చి బాలలకు అందించారు. ప్రస్తుత చిన్న పొత్తం బాలల్లో సైన్సు పట్ల అవగాహన, ఆసక్తి పెంపొందిస్తుంది. భారతదేశపు విశిష్ట శాస్త్రవేత్తలు 21 మంది మహిళలను బాలలకు పరిచయం చేస్తుంది. సరళమైన భాష, క్లుప్తత పిల్లలతో ఆసక్తిగా చదివిస్తుంది. ప్రముఖ గణితవేత్త జ్యోతిశ్య శాస్త్రజ్ఞుడు భాస్కరాచార్యుల కుమార్తె లీలావతి నుండి మొదలు పెట్టి. ప్రప్రథమ మహిళా డాక్టర్ కాదంబినీ గంగూలి, వృక్ష శాస్త్ర నిపుణురాలు జానకీ అమ్మాళ్, వాతావరణ శాస్త్రవేత్త అన్నామణి, వ్యోమగామి కల్పనాచావ్లా వరకు ఇందులో పరిచయం చేయబడ్డారు. బాలలకు సంబంధించిన వివిధ రంగాలలో 42 పుస్తకాలను అందించిన రచయిత్రి శాంతా భాస్కర్ కృషి అభినందనీయం. బాల సాహిత్యానికి వీరి పుస్తకాలు, రచనలు అమూల్యమైన చేర్పు అని చెప్పవచ్చు.

**(విశిష్ట మహిళా శాస్త్రవేత్తలు భారతీయులు-బాల సాహిత్యం; రచన:శాంతా భాస్కర్; వెల: రూ.100/-; ప్రతులకు: లోకేష్ ప్రచురణలు; చిత్తూరు)**

**- కూర చిదంబరం**

## అందాయి



**మేఘరాగరంజని**
ప్రేమఖండికాకావ్యం
రచన: 'రఘువర్మ'
(డా॥ టి.లక్ష్మీనారాయణ)
ప్రతులకు: డా॥ టి.లక్ష్మీనారాయణ
3-1-264, పురానిపేట్
జగిత్యాల
జగిత్యాల జిల్లా, తెలంగాణ;
అన్ని ప్రముఖ పుస్తక కేంద్రాలు

**విద్యార్థి! శతకము**
రచన: సవ్వప్పగారి ఈరన్న
(మొలగవల్లి కొట్టాల)
ప్రతులకు: సవ్వప్పగారి ఈరన్న
15-58-సి, యస్.ఆర్.పేట
పత్తికొండ-518 380
కర్నూలు జిల్లా, ఆంధ్రప్రదేశ్;
అన్ని ప్రముఖ పుస్తక కేంద్రాలు

**అల చిగురించిన నావ**
(కవిత్వం)
రచన: శ్రీనివాస్ మల్లాడి
ప్రతులకు: శ్రీనివాస్ మల్లాడి
సన్నాఫ్ దేవదాస్
5-163/1,
కాట్రేనికోన పోస్ట్ అండ్ మండలం
కొత్తపాలెం
నడవపల్లి రోడ్-533 212
డా.బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా

**యద్భావం తద్భవతి**
ఆధ్యాత్మిక కథలు
రచన: ఆర్.సి.కృష్ణస్వామి రాజు
ప్రతులకు: ఆర్.సి.కృష్ణస్వామి రాజు
22-4-71, బ్యాంక్ ఎంప్లాయీస్ కాలనీ
అక్కరాంపల్లి పోస్ట్
తిరుపతి-517 507;
అన్ని ప్రముఖ పుస్తక కేంద్రాలు

**లఘు కవిత్వంలో 'నానో' ప్రస్థానం**
రచన: ఎస్.ఆర్.పృథ్వి
ప్రతులకు: పి.ఉషారాణి
కేరాఫ్: పి.వి.వి.ఎన్.శివ ప్రసాద్
5-12-100/325, సాయి అంబిక
కలనీ, ఫేజ్-1
రోడ్ నం.14 బి, బ్లాక్ 'సి'
అమీన్‌పూర్-502 033
సంగారెడ్డి జిల్లా, తెలంగాణ.

**నానీలు**
రచన: దేగల అనితాసూరి
ప్రతులకు: ఇ-మెయిల్:
greeshu.sai@gmail.com
greeshu_sai@yahoo.com

# 'కాణవేధ' అంటే ఏమిటి?

వాస్తువార్త
వాస్తు విద్వాన్ సాయిశ్రీ
డా॥ దంతూరి పండరినాథ్
సెల్: 9885446501/9885449458



'విచ్ఛిద్రం దిశి కాణకం'

గృహం ముఖద్వారానికి రెండు వైపుల కూడా సరైన విధంగా రెండు కిటికీలు ఉండటం వాస్తు సమ్మతం. అలా కాకుండా ముఖద్వారానికి ఒక వైపున మాత్రమే కిటికీ ఉండి మరొక వైపు కిటికీ లేకపోవటం వలన 'కాణవేధ' దోషం కలుగుతుంది.

ముఖద్వారానికి ఇరు వైపుల ఉండే కిటికీలను గృహాన్ని కన్నులతో పోల్చటం వాస్తు విధానం. ఒక కిటికీ మాత్రమే ఉండటం వలన ఒక కన్ను మాత్రమే వున్నట్టుగా అర్థం వస్తుంది. కిటికీలు సరైన విధంగా వుండక పోవటం చేత కూడా 'కాణవేధ' దోషం కలుగుతుంది.

ఈ దోషం వలన యజమానికి, అందులో నివసించే వారికి నేత్ర సంబంధ రోగాలు కలిగే అవకాశం ఉన్నది. మూగ, చెవిటి, గుడ్డి మొదలైన లక్షణాలతో కూడిన సంతతి కలిగే అవకాశమున్నది. అందుకని నిర్మాణంలోనే ఈ దోషం లేకుండా జాగ్రత్త పడటం అవసరం. ఒకవేళ దోషం వుంటే వాస్తు నిపుణుల పర్యవేక్షణలో సరిచేసుకోవటం ఉత్తమం.

## 'బధిర వేధ'

**పృద్వీదారం బధిరం**

ద్వారాలు (సింహద్వారం మొదలైన ఏ ద్వారమైనను) గృహం నేలమట్టం ఫ్లోర్ లెవెల్ కంటే పై భాగంలోనే వచ్చేలా ప్రతిష్ఠంచటం వాస్తు విధానం. అలాగాక ద్వారాలు నేలమట్టం కంటే దిగువ భాగానికి అమరినట్లయితే ఆ గృహం, 'బధిర వేధ' దోషమును గలిగి ఉన్నదని గ్రహించాలి.

**శ్లో॥ పృద్వీద్వారే సర్వ దుఃఖం
మరణం చప్రజాయతే ।**

తీవ్రమైన 'బధిర వేధ' దోషం సమస్తమైన దుఃఖాలను, కష్టనష్టాలనే కాకుండా తీవ్రమైన పరిణామాలను కూడా కలుగజేయునని చెప్పబడినది. అందువల్ల ఇటువంటి దోషం లేకుండా ఇంటి నిర్మాణ సమయంలోనే జాగ్రత్త పడటం మంచిది. పూర్తి గృహ నిర్మాణాంతరం గది లోపల నేలమట్టం ఫ్లోర్ లెవెల్ పెంచే సమయంలోగానీ, పాత టైల్స్ పైన కొత్త టైల్స్ వేసి, తలుపు కింద టైల్స్ వేయకుండా వదిలేసినప్పుడు ఈ దోషం వచ్చే అవకాశం ఉంది. ఈ విషయం జాగ్రత్తగా గమనించి సరి చేసుకోవటం వల్ల సత్ఫలితాలను పొందవచ్చు.



## వ్యంగ్యవేధ

**వచనం: వ్యంగ్యో హినాంగభేకయోః** (విశ్వకోశ గ్రంథం)

'వ్యంగ్యమనగా అంగహీనమైనదని అర్థం వస్తుంది.

'వ్యంగ్యంచాసద్దర్శనం'.. గృహానికి లక్షణంగా వుండవలసిన అంగములలో ఏదైనా అంగము లేకున్నా, అవలక్షణంగా ఉన్నా ఆ గృహం అంగహీనమవుతుంది. ఏ విధమైన అంగములు గలిగిన గృహమైనను 'వ్యంగవేధ' అనే దోష పూరితమవుతుంది. 'వ్యంగవేధ' గల గృహమును గలిగి ఉన్న యజమాని, అందులో నివసించేవారు కూడా ఈ దోషం వలన అంగవైకల్యం, శత్రుబాధను. మానసిక సంబంధమైన బాధను పొందే అవకాశం ఎక్కువగా ఉంటుంది.

ఇటువంటి దోషాలను గృహ నిర్మాణాంతరం సవరించటం చాలా కష్టం. ఒక్కోసారి అసాధ్యమువుతుంది. అందువల్ల గృహ నిర్మాణ సమయంలోనే ఇలాంటి దోషాలు రాకుండా జాగ్రత్త పడటం అన్ని విధాలుగా మంచిది.

## ఇంట్లో వాస్తు దోషాలున్నాయా?

– రాగిణి, రేపల్లె

**ప్రశ్న: ఈ ఉత్తరంతో పాటు మా ఇంటి ప్లాను, మా వారి జాతకం, పెద్దబ్బాయి జాతకం పంపిస్తున్నాను. మా వారు ప్రభుత్వ ఉద్యోగి. అయినా ఆర్థికంగా ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం. ఇల్లు కట్టి ఆరు సంవత్సరాలు అయింది. అప్పటి నుండి కష్టాలు మొదలయ్యాయి. ఇంటి వాస్తు దోషమో, జాతక దోషమో మాకు తెలియటం లేదు. మా ఆయన జాతక రీత్యా మాకు ఇల్లు ఉంటుందో/ ఉండదో అర్థం కావడం లేదు. సలహా చెప్పగలరు.**

**జవాబు:** ఈ విషయంలో పత్రికా ముఖంగా కంటే మీకు ఫోనులో సలహా యివ్వటం మంచిదనుకుంటున్నాను. ఒకసారి ఫోన్ చేసి మాట్లాడండి. మీ సందేహాలు నివృత్తి అవుతాయి.

వాస్తు విద్వాన్ డా॥ దంతూరి పండరినాథ్ పాఠకుల సమస్యలకు ఆదివారం 'వాస్తువార్త'లో సమాధానాలిస్తారు. ఈ కింది కూపన్ జతచేసి సమస్యలు పంపవలసిన చిరునామా: సాయిశ్రీ వాస్తు కన్సల్టెన్సీ, 3-2-4, కింగ్స్‌వే, రాష్ట్రపతి రోడ్, సికింద్రాబాద్-3

వాస్తువార్త

పూర్తి పేరు : ........................................
పుట్టిన తేది : ........................................
జన్మ నక్షత్రం: ................తల్లి పేరు: ............
చిరునామా:.............................................

# సమయపాలన అవసరం

**జీవితంలో** ప్రతి మనిషి కొన్ని లక్ష్యాలను ఏర్పరచుకోవాలి. ఆ లక్ష్యాల సాధన కోసం కృషిచేయాలి. నిర్ణీత సమయంలోనే నిర్ణయించుకున్న లక్ష్యాలను సాధించాలి. అప్పుడే విజేత అవుతాడు. ప్రతి పనిని నిర్ణీత సమయంలో ముగించడానికి డెడ్ లైన్ ఏర్పరచుకోవాలి. విద్యార్థులు పరీక్ష రాయడానికి మూడు గంటల సమయం ఇస్తారు. ఇచ్చిన సమయంలో సమాధానాలు మొత్తం రాయగలిగిన నేర్పు ఉండాలి. ప్రతి పనికి ఒ గడువు తప్పనిసరి. ఆ గడువులోగా పని పూర్తి చేయడానికి సమయపాలన అవసరం.

చిన్నతనంలో సమయపాలన గురించి నేర్చుకున్న విషయాలు ఎవరు గుర్తు పెట్టుకుని పాటిస్తారో వారు మాత్రమే తమ లక్ష్యాలను సాధించగలరు. ఆఫీసుకు సమయానికి రావడం సమయం ముగిసేలోపే పని ముగించేవారే పనిమంతులు. ఇందుకు భిన్నంగా చాలా కార్యాలయాల్లో ఆఫీసు సమయం అయిపోయినా పనులు చేస్తూ కనిపిస్తారు.

ప్రైవేటు సంస్థల్లో అనుకున్న సమయానికి పని పూర్తి చేయాలి. అయితే ప్రభుత్వ ఆఫీసుల్లో సరైన నియంత్రణ కఠిన చర్యలు ఉండవు కనుక గడువు దాటినా పనులు ముగించరు. పైగా ఆఫీసు పనులు ఆ వేళల్లో చేయాల్సిన పనులు ఆఫీసు ముగిసిన తర్వాత చేస్తూ అదనంగా ఓవర్ టైం చెల్లించాలని డిమాండ్ చేస్తుంటారు.

అభివృద్ధి చెందిన దేశాల కన్నా మన దేశంలోనే ఈ జాడ్యం ఎక్కువ. గడువులోపు పనులు చేయలేకపోవడం వల్లనే అభివృద్ధి చెందలేకపోతున్నాం. చెప్పిన సమయంలో పనులు పూర్తి చేయలేనివారు, వాయిదా వేసేవారు జీవితంలో విజయం సాధించలేరు. అలాంటివారు తమ సమస్య నుండి బయట పడి లక్ష్యాలను సాధించాలంటే సమయ పాలన పాటించాలి. గడువు అనగానే భయపడడం అనవసరం. గడువు అనేది అవసరమనే విషయం ముందుగా అంగీకరించాలి. ఆ విషయం మనసులో స్థిరపరచుకోవాలి. అక్కడ నుంచి ఆ పని చేయగలనని అనుకోవాలి. గడువు తేదీకన్నా ముందుగానే పనులు ముగించేలా ఏర్పాటు చేసుకోవాలి. ప్రతి లక్ష్యం సాధించడానికి మనకు మనమే ఒక సమయాన్ని నిర్ణయించుకుంటే గడువులోగా పనిని ముగించే వీలుంటుంది. ఒకసారి లక్ష్యం ఎంత కాలంలో ముగించాలో నిర్ణయించుకున్నాక అది సాధించడానికి ఏం చేయాలి, ఎలా చేయాలి? ఆ పనిని ఎన్ని భాగాలుగా విడగొట్టి చెయ్యాలన్నది నిర్ణయించుకోవడం అవసరం. పనులను సమర్థంగా చేయడంలో కిటుకు ఆ పనులను ప్రాధాన్యతా క్రమంలో అమర్చుకోవడంలోనే ఉంటుంది. మనం చేయాల్సిన అన్ని పనుల పైనా ఇష్టం ఉండకపోవచ్చు. కానీ లక్ష్యసాధనలో భాగంగా కొన్ని ఇష్టంలేని వాటిని కూడా చేయాల్సి ఉంటుంది. అటువంటి ఇష్టంలేని పనులను ముందుగా ముగించడం మంచిదంటారు నిపుణులు. అప్పుడు ఇష్టమైనవాటిని సంతోషంగా చేసుకోగలుగుతారు.

## హిమాలయాలు-పురాణాలు

హిమాలయ పర్వతాలకు, మన పురాణాలకు సన్నిహిత సంబంధం ఉన్నది. సర్వజగాలకు మంగళ ప్రదాయిని అయిన పార్వతీదేవి శివుని అర్ధాంగి. ఆమె హిమవంతుడి పుత్రిక. హిమాలయాలు శివుడికి అత్తవారిల్లయితే కైలాస పర్వతం ఆయన నివాస స్థానం. బ్రహ్మకు సత్యలోకం, విష్ణువుకు వైకుంఠం, పరమశివుడికి కైలాసం నివాస స్థానాలు. దేవతలకు ఆవాస స్థానమైన హిమాలయ పర్వతాలు మన దేశానికి పెట్టని కోటలాంటివి, రక్షణ కలిగించే మహోన్నత పర్వతాలు. ఇవి ప్రతి భారతీయుడికి ఎంతో పవిత్రమైనవి.

కైలాసశిఖరం సాక్షాత్తు శివుని నివాస స్థానంగా పుణ్యప్రదమయినది. ఆ ప్రాంతంలోనే బ్రహ్మ స్వయంగా సృష్టించినదని ప్రసిద్ధి చెందిన మానస సరోవరం కూడా ఉంది.

పర్వతాలు అనేకం ఉండవచ్చు. కానీ కైలాస పర్వతానికి ఉన్న విశేషం, ఖ్యాతి మిగిలిన వాటికన్నా భిన్నమయినది. దాదాపు రెండు వేల ఐదు వందల సంవత్సరాలుగా కైలాస శిఖరం ప్రముఖ తీర్థయాత్రా స్థలంగా భక్తులను, పర్యాటకులను విశేషంగా ఆకర్షిస్తోంది. హిమాలయాల్లో ఉన్న కైలాస, మానస సరోవర ప్రాంతం అందరికీ విశేష ఆకర్షణగా తయారయింది.



హిందూ, జైన, బౌద్ధ మతస్థులు టిబెట్టు ప్రాంతంలో నివసించే బోన్‌పాల్ ఈ కైలాస మానస సరోవర ప్రాంతం పట్ల ఎంతో భక్తి విశ్వాసాలు ప్రకటిస్తారు.

ఈ ప్రాంతం అంతా ఒకప్పుడు అఖండ భారతదేశంలోని భాగమే. కానీ దురదృష్టవశాత్తు ప్రస్తుతం చైనా ఆక్రమిత టిబెట్టు ప్రాంతంలో ఒక భాగంగా ఉంది. 1962లో భారతదేశంపై చైనా దురాక్రమణ జరిపింది. దాంతో అనేక రాజకీయ కారణాల వల్ల 1962 నుంచి 1981 వరకు భారతీయ యాత్రికులను కైలాస యాత్రకు అనుమతించలేదు. ఆ సమయంలో మన కైలాస పర్వతాన్ని, మానస సరోవరాన్ని దర్శించలేక ఎందరో భక్తులు ఆవేదన చెందారు.

ఆ తర్వాత భారత ప్రభుత్వం చైనా ప్రభుత్వంతో ఒప్పందం కుదుర్చుకుంది. దానివల్ల భారత యాత్రికులను బృందాల వారిగా అక్కడకు అనుమతిస్తున్నారు. పశ్చిమ టిబెట్టు ప్రాంతానికి వెళ్లి అక్కడ కైలాస మానస సరోవరాల యాత్రకు 1962 వరకు భారతీయులకు ఎలాంటి అడ్డంకులు ఉండేవి కావు. కానీ 1981 నుంచి యాత్ర చేయడానికి చైనా వీసా తప్పనిసరైంది. గతంలో హిందువులు జైనులు, బౌద్ధులు బోన్‌పాల్‌కు మాత్రమే ఈ ప్రాంత సందర్శనానికి అనుమతించే వారు. ఇప్పుడు ప్రపంచం నలుమూలల నుంచి వచ్చే యాత్రికులను పర్యాటకులను కైలాస సందర్శనం కోసం అనుమతినిస్తున్నారు. దాంతో అనేక ఏజెన్సీలు టూరిస్టు కంపెనీలు ఈ యాత్రను నిర్వహిస్తున్నాయి.

**– యామిజాల జగదీశ్**

# నైతిక విలువలు నేర్పించాలి..

కనుమరుగైపోతున్న మానవతా విలువలు, కరువైపోతున్న మానవ సంబంధాల దృష్ట్యా విద్యార్థినీ విద్యార్థులకు పాఠ్యాంశాల ద్వారా నైతిక విలువల బోధన చేయడం ఎంతో ఆవశ్యకం. ప్రపంచీకరణం కారణంగా బోధన అంశాలలో, బోధన పద్ధతులలో గణనీయమైన పురోగతి సాధించినా మన సంస్కృతిని విస్మరిస్తూ పోవడం శోచనీయం.

విద్య అనేది పూర్తిగా ధన సంపాదనకు సంబంధించిన అంశంగా భావించడం ఏమాత్రం మంచిది కాదు. సమాజ శ్రేయస్సును సైతం దృష్టిలో ఉంచుకోవాలి.

నిరాడంబర జీవనం, నిరహంకారం, నిరంతర కృషి, సామరస్య జీవనం, సమాజం పట్ల శ్రేష్ఠ భావన అనే గుణాలు పిల్లలకు విద్య ద్వారా నేర్పించగలగాలి. అప్పట్లో ఇలాంటి సద్గుణాలు నేర్పేందుకు గురుకులాలు ఉండేవి. ఇప్పుడు ఆ బాధ్యతను తల్లిదండ్రులు తీసుకోవలసిన అవసరం ఎంతైనా ఉంది. ఎందుకంటే శ్రేష్టమైన సమాజమే సంస్కృతి మొదటి ఉద్దేశం కాబట్టి.



ముఖ్యంగా పిల్లల బాధ్యతను తొమ్మిది సంవత్సరాల వరకు తల్లి, ఆపై పద్దెనిమిది సంవత్సరాల వరకు తండ్రి సక్రమంగా తీసుకోగలిగితే– పెరిగి పెద్దయిన ఆ పిల్లలు వివేకంతో, సంస్కారంతో చక్కటి జీవితాన్ని గడపగలరు.

భగవంతుడు ప్రేమకు స్వరూపం, అలాంటి భగవంతుని సమానులైన తల్లిదండ్రులను పిల్లలు ప్రేమించగలిగేలా తల్లిదండ్రుల పెంపకం ఉండి తీరాలి. కానీ దురదృష్టవశాత్తు ఇప్పుడు వృద్ధులు పలు కారణాల వల్ల తీవ్ర నిరక్ష్యానికి గురవుతున్నారు. సమాజ మనుగడకు ఎంత మాత్రం శ్రేయస్కరం కాదు.

భగవంతున్ని విశ్వసించడం, ధర్మాన్ని ఆచరించటం, జ్ఞానాన్ని పెంపొందించడం లాంటి సద్గుణాలు పిల్లలు అలవర్చుకోవాలి. 'జగమంత కుటుంబం నాది..' అనే భావన పిల్లలకు కలిగించి, ఆ భావనను నలుగురికి పంచటంలోని ఆనందాన్ని పొందగలిగేలా చేయాలి.



పిల్లలతో తల్లిదండ్రులు గడిపే సమయం చాలా కీలకం. అలాంటి వాతావరణం పిల్లల మానసిక ఎదుగుదలకు, పరిపక్వతకు ఎంతగానో దోహదపడుతుంది. కానీ ఇందుకు విరుద్ధంగా నేటి పోటీ ప్రపంచంలో భార్యా భర్తలు ఇరువురూ ఉద్యోగ బాధ్యతలు నిర్వహిస్తూ పిల్లలను హాస్టల్లో ఉంచి చదివించడం జరుగుతోంది. ఇతరులతో పోల్చుకుంటూ "పిల్లల ఫీజుల రూపంలో లక్షలు గుమ్మరిస్తేనే లక్షణాలు అబ్బుతాయి.." అనే భావన తల్లిదండ్రులు మరిచిపోవాలి. అందుకుగాను ప్రభుత్వాలు ఉచిత విద్యను ప్రోత్సహించే విధంగా చర్యలు చేపట్టి సమాజ శ్రేయస్సుకై తోడ్పడాలి. నేటి బాలలే, రేపటి పౌరులు.

**- టి. ధనుంజయ రెడ్డి**

## కార్టూన్లకు ఆహ్వానం


**కార్టూనిస్టుల నుండి ఆరోగ్య కరమైన హాస్యాన్ని అందించే కార్టూన్లను స్వాగతిస్తున్నాం. అంశం ఏదైనా సరే! మంచి హాస్యాన్ని అందించాలి. కార్టూన్లతో పాటు మీ పేరు, చిరునామా, హామీ పత్రం తప్పనిసరిగా జత చేయాలి. ఎంపిక కాని కార్టూన్లను తిప్పి పంపగోరేవారు తగిన పోస్టేజీ జత చేసిన కవరు పంపించాలి. కార్టూన్లు పంపించాల్సిన చిరునామా: ఎడిటర్, ఆదివారం వార్త, నం.396, లోయర్ ట్యాంక్ బండ్, డిబిఆర్ మిల్స్ పక్కన, హైదరాబాద్-80.**

**sunmagvaartha@gmail.com**

# అరుదైన కోడి జాతి 'ఒనగడోరి'

సాధారణంగా కోడి పుంజు అంటే వెయ్యి రూపాయల వరకు ధర పలుకుతుంది. అదే పందెం కోడి పుంజు ధర వేలల్లో ఉంటుంది. జపాన్‌కు చెందిన ఒనగడోరి అనే కోడి పుంజుధర ఏకంగా లక్షల్లోనే ఉంటుందంటే అశ్చర్య కలగక మానదు.

జపాన్‌లో అనేక రకాల కోళ్లు ఉన్నాయి. వీటిని స్థానికంగా నిర్దిష్ట ఉపయోగాల కోసం పెంచుతారు. ఒనగడోరి అనేది ప్రదర్శన కోసం ఉపయోగించే ఒక రకానికి చెందిన కోడి జాతి. దీనిని 'గాలస్ గాలస్ డొమెస్టిక్స్' అనే శాస్త్రీయ నామంతో పిలుస్తారు.



ఒనగడోరి అంటే గౌరవనీయమైన కోడి, పొడవాటి తోక కోడి అనే అర్థాలు ఉన్నాయి. ఈ అందమైన జపనీస్ కోళ్లు జపాన్‌లో ఎంతో గౌరవం ఉంది. ఒనగడోరి కోడి ధర రెండు లక్షల వరకు ఉంటుంది. ఈ జపనీస్ కోడి పుంజు అందమైన, పొడవైన తోకకు ప్రసిద్ధి చెందింది. జపనీస్ సంస్కృతిలో దీనిని శుభప్రదమైన పక్షిగా భావిస్తారు. ఈ రకమైన కోళ్లు భారతదేశంలో అక్కడక్కడా కనిపించినప్పటికీ అవి కొంచెం భిన్నంగా ఉంటాయి. ప్రస్తుతం ఒనగడోరి పేరుతో పిలుస్తున్న ఈ కోళ్లు ఒకప్పుడు గోషికిడోరి, చోబికేయు, నాగోదోరి మొదలైన పేర్లతో పిలిచేవారు. చివరకు అధికారికంగా ఇప్పుడు ఒనగడోరి అని పిలుస్తున్నారు.

## ఒనగడోరి కోళ్ళ చరిత్ర

ఒకగడోరి కోళ్ల జపాన్ సంస్కృతిలో భాగంగా భావిస్తారు. పొడవాటి తోకతో ఇవి చాలా అందంగా ఉంటాయి. ఈ జాతి జపాన్‌లోని షికోకు ద్వీపానికి చెందినవి. ఆ ద్వీపంలో ఒనగడోరి జాతి కోళ్లను దాదాపు 400 సంవత్సరాల నుండి పెంచుతున్నట్లు అక్కడి చరిత్ర చెబుతోంది. ఈ కోళ్లను సంపన్న కుటుంబాల వారు పెంచుతుంటారు. వాటిని పెంచడం హోదాకు చిహ్నంగా భావిస్తుంటారు. ఒనగడోరి కోడిని సాంస్కృతిక వారసత్వంగానే కాక జాతీయ నిధిగా జపాన్ వాసులు భావిస్తారు. జపాన్‌లోని షమో అనే జాతితో పాటు ఇతర జాతులను సంకరం చేసి ఒనగడోరి కోడి జాతిని అభివృద్ధి చేశారు. ఒనగడోరి కోడి పుంజులను పందెం కోళ్ళుగా వాడిన సందర్భాలు ఉన్నాయి. దీన్ని అలంకార పక్షిగా ఉపయోగించడాన్నే అందరూ ఎక్కువగా ఇష్టపడతారు. జపాన్ తోటలలో, ఆలయాలలో అలంకార పక్షిగానే దీన్ని పెంచుతారు. ఒకప్పుడు షికోకు దక్షిణ ద్వీపకల్పంలో యమనోచి చక్రవర్తి టెన్నో గౌరవార్థం పలు సందర్భాలలో తన సైనికుల శిరస్త్రాణాలతో పాటు ఈటెలకు ఈ కోడి పొడవైన ఈకలతో అలంకరించేవారు. ఒనగడోరి కోళ్ళ జాతిని సంకరం చేసి చైనాకు కూడా ఎగుమతి చేశారు. దక్షిణ చైనాలోని హైనాన్ దోలో ఈ జాతి మరింత మెరుగులు దిద్దుకుంది. అయితే జపాన్‌లో ఒనగడోరి కోళ్ళ అంత పొడవైన తోక వీటికి పెరగలేదు. పలు దేశాలలో ఇటువంటి కోళ్ళను పెంచుతున్నప్పటికీ జపాన్‌లోని ఒనగడోరి కోళ్ళ స్థాయి పేరు ప్రఖ్యాతులు పొందలేకపోయాయి.

## పొడవాటి తోక

జపాన్ భాషలో ఒనగడోరి అంటే పొడవాటి తోక కోడి, గౌరవనీయమైన కోడి అని అర్థం. అసాధారణంగా దీని తోక 13 మీటర్ల పొడవు ఉంటుంది. ఒనగడోరి కోడితోక సాధారణంగా మీటరు నుండి నుండి 9 మీటర్ల వరకు పొడవు పెరుగుతుంది. జీవితాంతం ఈ తోక పెరుగుతూనే ఉంటుంది. అదే కోడి పుంజుకైతే ఏకంగా 13 మీటర్ల వరకు తోక పెరుగుతుంది. ఇప్పటి వరకు 13 మీటర్ల తోక పెరగడం అనేది రికార్డుగా మిగిలింది. ఇంత పొడవైన తోకను కలిగి ఉండటంతో వీటిని పొడవైన బోన్లతో పాటు అతి పెద్ద గుడిసెల్లో ఉంచి ప్రత్యేక శ్రద్ధతో వీటిని పరిరక్షిస్తారు. ఈ కోళ్ళు ఎత్తైన ప్రదేశాల్లో కూర్చున్నప్పుడు ఈనెల్లా దీని తోక అందంగా వేలాడుతూ బహు సుందరంగా కనిపిస్తుంది. ఇంత పెద్ద తోక చూసి ఎవరైనా ఖంగు తినక మానరు.

మన ప్రాంతంలో నెమలికి కూడా ఇంత పొడవైన తోక కనిపించదనే చెప్పాలి. నెమలి పురి పొడవు తక్కువగా ఉన్నప్పటికీ వెడల్పు అధికంగా ఉంటుంది. ఒనగడోరి అనేది ఒక ప్రత్యేకమైన జాతికి చెందిన కోడిపుంజు. 1951లో ఒనగడోరి కోడి పుంజు రేఖా చిత్రంతో జపాన్‌లో పోస్టల్ స్టాంపును విడుదల చేశారు.



చిత్రలేఖనంలో సైతం ఒనగడోరి కోళ్లకు పెద్దపీట వేశారు. 1982వ సంవత్సరంలో దీనికి 'నేషనల్ ట్రెజర్' అనే బిరుదు లభించింది.

## ప్రత్యేక గుర్తింపు

ఒనగడోరి జాతిని జపాన్ ప్రభుత్వం ప్రత్యేక సహజ స్మారక చిహ్నంగా గుర్తించింది. ప్రస్తుతం ఇవి జపాన్ దేశంలో 150 మాత్రమే ఉన్నట్లు అంచనా. అంతరించి పోతున్న కోళ్ళ జాతిలో ఇది ఒకటి. ఆ కారణంగా ఈ జాతి కోడి గుడ్లను జపాన్ దేశం నుంచి బయటకు తీసుకొని వెళ్లడానికి అక్కడి చట్టాలు అంగీకరించవు. ఎవరైనా అలా తీసుకుని వెళితే దాన్ని అక్రమ రవాణా కింద పరిగణిస్తారు. ఈ కోడి పుంజు కేజిన్నర నుండి రెండు కేజీల వరకు బరువు పెరుగుతుంది. వీటి చర్మం లేత పసుపు వర్ణంలో ఉంటుంది. పెట్టలు లేత గోధుమవర్ణంలో గుడ్లను పెడతాయి, ఒనగడోరి జాతి కోళ్లు మంచి వైద్య స్వభావాన్ని కలిగి ఉంటాయి. ఇతర కోళ్లను ఈ జాతి కోళ్లతో కలపకుండా జాగ్రత్త వహిస్తారు. అంతరిస్తున్న ఈ కోడి జాతిని పరిరక్షించడానికి ప్రభుత్వంతో పాటు అనేక స్వచ్ఛంద సంస్థలు కృషి చేస్తున్నాయి. ఒనగడోరి కోళ్లతోక పొడవుగా పెరిగి ఈకలు శుభ్రంగా ఉండాలని వాటిని పెద్దపెద్ద గుడిసెల్లో విశాలంగా ఉండే ప్రదేశాల్లో పెంచుతుంటారు. సంతానోత్పత్తికి అనుకూలమైన వాతావరణాన్ని కల్పిస్తూ కోడితో పాటు, కోడి పుంజులను ఒకచోటే పెంచుతుంటారు. తోకలు దెబ్బతినకుండా పొడవుగా పెరగాలంటే ఈ కోళ్లు కూర్చోదానికి ఎత్తైన ప్రదేశం అవసరం.

## వివిధ రకాలు

ఒనగడోరి కోళ్లల్లో అనేక రకాలు ఉన్నాయి. ఒనగడోరి జపాన్‌కు చెందిన ఒక ప్రత్యేకమైన కోడి జాతి. దీని పొడవైన తోక, ఈకల వలన ప్రసిద్ధి చెందింది. ఇవి రంగు, ఈకల



నమూనాల ఆధారంగా పలు పేర్లతో విభజించారు.

**షిదో:** ఈ జాతి కోడి తెల్లని ఈకలను కలిగి ఉంటుంది. ఇది స్వచ్ఛమైన తెలుపు రంగులో ఉంటుంది. తోక, ఈకలు అత్యంత పొడవుగా ఉంటాయి.

**కురో:** నల్లని ఈడలతో కూడిన రకం. ఈ రకం ఒనగడోరిలో నలుపు రంగు అధికంగా ఉంటుంది.

**అకా:** ఎరుపు, గోధుమ రంగుల ఈదలతో ఉండే రకం. ఈ రకంలో ఈకలు ఎరుపు, కొన్ని కోళ్లు గోధుమ రంగు ఛాయలలో ఉంటాయి.

**గింజిరో:** వెండి రంగు ఈకలతో కూడిన రకం. ఇది వెండి-తెలుపు మిశ్రమ రంగులో ఉంటుంది. చాలా ఆకర్షణీయంగా కనిపిస్తుంది.



**కిన్టరో:** బంగారు రంగు ఈకలతో ఉండే రథం ఈ రకంలో ఈకలు బంగారు పసుపు రంగు ఛాయలలో ఉంటాయి. ఇంకా ఒనగడోరి కొన్ని జాతుల కోళ్ళు ప్రకాశవంతమైన ఎరుపు రంగును కలిగి ఉంటాయి. వాటి ముక్కు పసుపు రంగులో ఉంటుంది. ఈ రకం కోళ్ల కళ్లు గోధుమ, ఎరుపు మిశ్రమంగా ఉంటాయి. వాటి చెవిపోగులు చాలా లేత పసుపు, కొన్ని సందర్భాల్లో తెలుపు రంగులో ఉంటాయి. కొన్ని కోళ్ళల్లో కాళ్ళు ఆకుపచ్చ, మరి కొన్నింటికి పసుపు కాళ్ళు ఉంటాయి. ఇంకొన్ని పసుపు ముక్కు ఎర్రటి కళ్ళు కలిగి ఉంటాయి. ఈ రకాలు ప్రధానంగా రంగు వైవిధ్యంపై ఆధారపడి ఉంటాయి. కానీ అన్ని ఒనగడోరి కోళ్ల సాధారణ లక్షణం ఏమిటంటే- అవి అసాధారణంగా పొడవైన తోక ఈకలను కలిగి ఉంటాయి. ఇవి ప్రారంభంలో పొట్టిగా ఉన్నప్పటికీ ఒక్కోసారి అసాధారణంగా పొడవు పెరుగుతుంది. ఈ జాతిని జపాన్‌లో సాంస్కృతికంగా, చారిత్రకంగా ఎంతో విలువైనదిగా భావిస్తారు. దీనిని పెంచడానికి ప్రత్యేక సంరక్షణ కేంద్రాలను ఏర్పాటు చేసి పరిరక్షిస్తుంటారు.

## ఖరీదెక్కువ

అతి ఖరీదైన కోడిగా ఒనగడోరి ప్రసిద్ధి చెందింది. జపాన్‌కు చెందిన అరుదైన ఈ కోడి ధర దాదాపుగా రూ.2 లక్షలు ఉంటుంది. ఈ కోడి చూడటానికి చాలా అందంగా ఉంటుంది. దీన్ని కొందరు లక్కీగా భావిస్తారు. అందుకే ఈ కోడి ధర కూడా ఎక్కువగా పలుకుతోంది. సాధారణ కోళ్లకు ఇది భిన్నంగా ఉంటుంది. జన్యు పరంగా నాణ్యత కలిగిన అరుదైన, అందమైన, పొడవాటి తోక కలిగిన ఒనగడోరి పుంజులు కొన్ని సందర్భాల్లో మూడు నుండి అయిదు లక్షల వరకు ధర పలికిన సందర్భాలు ఉన్నాయి. ఈ కోళ్ల గుడ్లను సంతానోత్పత్తికే వినియోగిస్తారు. ఇవి కూడా అత్యధిక ధర పలుకుతాయి. ఒనగడోరి కోడి పుంజు గుడ్డు ధర ఎప్పుడూ ఒకేలా ఉండదు. మార్కెట్లో ఉన్న డిమాండ్‌ను బట్టి ధరలు మారుతుంటాయి. ఏది ఏమైనా ఒనగడోరి జాతి కోళ్లు చాలా అందంగా ఉంటాయి. శతాబ్దాలుగా జపనీయులు ఈ జాతిని సంరక్షించుకోవడానికి అత్యంత శ్రద్ధ తీసుకుంటున్నారు. జపాన్ ప్రభుత్వం సాంస్కృతిక ఆస్తిగా ప్రకటించి ఒనగడోరి కోళ్లను పరిరక్షిస్తోంది. అరుదైన జాతి పెంపుడు పక్షి ఒనగడోరి అని జపాన్ వారు భావించి వీటిని కంటికి రెప్పలా కాపాడుకుంటున్నారు.

**- షేక్ అబ్దుల్ హకీం జాని**

## జూన్- 22, 2025 నుండి జూన్- 28, 2025 వరకు



# వారఫలం


శ్రీమతి ములుగు శివజ్యోతి, ప్రముఖ జ్యోతిష్యురాలు
నారాయణ నాయక్ కాంప్లెక్స్, 2వ అంతస్తు,
గాంధీ జ్ఞానమందిర్ వెనుక, కోఠి, హైదరాబాద్-1
ఫోన్ : 98494 53449, 9440927795


### మేషం

ఈ వారం భూముల షేర్లు, క్రయ విక్రయాలలో లాభాలు పొందుతారు. ప్రయాణాలలో నూతన పరిచయాలు పెరుగుతాయి. విందు, వినోదాలు, శుభకార్యాలలో చురుకుగా పాల్గొంటారు. ఆర్థిక పరిస్థితి ఆశాజనకంగా ఉంటుంది. కుటుంబ సభ్యులను కలిసి ఉల్లాసంగా గడుపుతారు. నిత్యం మహాపాశుపత కంకణం ధరించటం వలన మేలు జరుగుతుంది.

### వృషభం

ఈ వారం స్థిరాస్తి వివాదాలు పరిష్కారదశకు చేరుకుంటాయి. ఋణాలు తీరి ఊరట చెందుతారు. సంఘంలో కీర్తి ప్రతిష్ఠలు పెరుగుతాయి. ముఖ్యమైన వ్యవహారాలలో తొందర పాటు వద్దు. వాహనాల విషయాలలో నిర్లక్ష్యం తగదు. కీలక విషయాలలో జాగ్రత్తగా వ్యవహరించటం మంచిది. నిత్యం లక్ష్మీ తామరవత్తులు అష్టమూలికాతైలంతో కలిపి దీపారాధన చేయండి.

### మిథునం

ఈ వారం తొందరపాటు తగదు కోపతాపాలకు, వివాదాలకు దూరంగా వుండండి. నిత్యం పాశుపత కంకణం ధరించటం అన్ని విధాలా మంచిది. ఆస్తి వివాదాలు ఎదురై చికాకు కలిగించినా అధిగమించి ముందుకు సాగుతారు. ముఖ్యమైన వ్యవహారాలలో సన్నిహితుల సలహాలు తీసుకుంటారు. జీవిత భాగస్వామి నుండి ధన, వస్తు లాభాలు పొందుతారు.

### కర్కాటకం

ఈ వారం ఆరోగ్యం, వాహనాల విషయాలలో నిర్లక్ష్యం తగదు. వృత్తి, వ్యాపారాలలో స్వల్ప లాభాలు పొందుతారు. బంధువుల నుండి కీలక సమాచారం అందుకుంటారు. నానారకాల అరిష్టాలు, శత్రుబాధలు, బాధలు నశించడానికి త్రిశూల్ ఉపయోగించండి. ఉద్యోగాలలో బాధ్యతలు పెరిగినా సమర్థవంతంగా నిర్వహిస్తారు.

### సింహం

ఈ వారం అనుకోని అవకాశాలు లాభిస్తాయి. వాటిని సద్వినియోగం చేసుకోండి. నూతన కార్యక్రమాలకు, శ్రీకారం చుడతారు. స్థిరాస్థి వివాధాలు, తీరి నూతన ఒప్పందాలు కదురుతాయి. నల్లవత్తులు అష్టమూలికా తైలంతో కలిపి దీపారాధన చేయటం వలన శనేశ్వరుని అనుగ్రహం కలుగుతుంది. పాతమిత్రుల నుండి విలువైన సమాచారం అందుకుంటారు.

### కన్య

ఈ వారం క్రయ విక్రయాలలో లాభాలు పొందుతారు. అనుకున్న విధంగా పనులు పూర్తిచేస్తారు. పలుకుబడి పెరుగుతుంది. స్థిరాస్తి వివాదాలు తీరి లబ్ధిపొందుతారు. నిత్యం యజ్ఞభస్మాన్ని ధరించటం వలన యజ్ఞః చేసిన ఫలితం లభిస్తుంది. కాంట్రాక్టులు, సబ్ కాంట్రాక్టులలో ఉన్న లోపాలను ప్రమాదాలను గుర్తించి వాటిల్లో కొన్నింటికి దూరంగా ఉంటారు.

### తుల

ఈ వారం ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రంగా ఉన్నా అవసరాలకు డబ్బు అందుతుంది. తెల్లజిల్లేడు వత్తులతో అష్టమూలికా తైలంతో దీపారాధన చేయటం వలన విఘ్నేశ్వరుని అనుగ్రహం లభిస్తుంది. ఉద్యోగపరంగా మీ శక్తి సామర్థ్యాలు, కృషి ప్రశంసలకు నోచుకుంటాయి. వాస్తవ విషయాల కోసం, అబద్ధాలను నిజం చేసే యత్నాలు మానుకోమని ఉన్నతస్థానాలలోని వారితో ఘర్షణ పడతారు.

### వృశ్చికం

ఈ వారం సంతాన పురోగతి బాగుంటుంది. జ్యేష్ఠ సంతాన విషయంలో విద్యా సంబంధిత విషయంలో ప్రత్యేక శ్రద్ధ కనబరుస్తారు. విద్యా సంబంధిత విషయాలకు ప్రయివేటు వ్యక్తులను ఆశ్రయిస్తారు. వీసా, పాస్‌పోర్టు, గ్రీన్‌కార్డ వంటివి. ఇతర దేశాలలో అవసరమైన అన్ని విషయాలు లభిస్తాయి. నిత్యం సర్వదోష నివారణ కంకణం ధరించండి. కొత్త అవకాశాలు కలిసి వస్తాయి, కాని నిర్ణయాలు తీసుకోలేరు.

### ధనస్సు

ఈ వారం ఉన్నదాంతో సంతృప్తి పడాలని నిర్ణయించుకుంటారు. వంశపారం పర్య విషయ, వ్యవహారాలను అభివృద్ధి చేస్తారు. ఆంతరంగిక విషయాలు అంతరంగికులు బైటపెడితే తప్ప ఇతరులకు తెలియదు. ఈ విషయంలో కట్టుదిట్టంగా వ్యవహరించండి. నిత్యం దైవకార్యక్రమాలలో ప్రథమ తాంబూలము ఉపయోగించదగినది. పలుకబడి పెరుగుతుంది. స్థిరాస్తి వివాదాలు తీరి నూతన ఒప్పందాలు కుదురుతాయి.

### మకరం

ఈ వారం అధికార స్థానాలలో ఉన్న వారు ప్రతి చిన్న విషయానికే మీ మీద అధారపడతారు. నమ్మకం లేకపోయినా నమ్మి కొన్ని ముఖ్య కార్యక్రమాలు ఇతరులకుల అప్పగిస్తారు. మీరు సలహాదారులపైనా, అనుచర వర్గంపైనా అధికంగా ఆధారపడినట్లు కనిపిస్తారు. మీ మనసుకు తెలుసు మీరు ఎవ్వరి మీదా ఆధారపడలేరని శుభకార్యాల విషయంలో అనిశ్చిత స్థితి తొలగిపోతుంది. పుకార్లను నమ్మవద్దు.


### కుంభం


ఈ వారం సభలు, సమావేశాలలో చురుకుగా పాల్గొంటారు. నిత్యం అరటినార వత్తులు, అష్టమూలికా తైలంతో దీపారాధన చేయటం అన్నివిధాలా మంచిది. కొన్ని అప్పులు చేయవలసి రావచ్చు, అవి అభివృద్ధి కొరకు మాత్రమే ఖర్చు చేస్తారు. ఇంటా బయటా అనుకూల వాతావరణం ఉంటుంది. నూతన పెట్టుబడులక అనుకూలమైన సమయం శుభకార్యాలు ఘనంగా చేస్తారు. నూతన ఆభరణాలు కొనుగోలు చేస్తారు.


### మీనం

ఈ వారం ప్రత్యర్థులు సైతం మిత్రులుగా మారి సాయం అందిస్తారు. నిత్యం సిద్ధగంధంతో శ్రీ వేంకటేశ్వరస్వామి వారికి పూజించడం చెప్పదగినది. సాహసం చేయలేని సందర్భానుసారంగా నిర్ణయాలు తీసుకోలేని ఆత్మీయవర్గం వల్ల, భాగస్వాములవల్ల కొన్ని ప్రయోజనాలను కోల్పోతారు. మీరు స్వయంగా ఆలోచన చేసి కొనుగోలు చేసిన ఆస్తుల విలువ బాగా పెరుగుతుంది. ప్రయాణాలు లాభిస్తాయి.

## ఈ వారం కా'ర్టూన్స్'


అందరూ బద్ధకస్తులైపోయున్నార్రా.. వండడం మానేసి
ఆన్లైన్లకు అలవాటు పడ్డారు.. మనకో ముద్దేసే వాళ్ళే లేరు!!


ఆఖరి కోరికలు గట్రా
తీర్చుకునే వచ్చారు గదా..!!?
AIR LINES
CHECK IN


అలిగి విమానం ఎక్కడం
ఏంటే...? వద్దు ప్లీజ్..!!





ఎంతో ప్రాచీనమైన రాజ్‌గఢ్ కోట మహారాష్ట్రలోని పుణెకు దగ్గరలో ఉంది. సుమారు ఐదు వేల అడుగుల ఎత్తులో వున్న ఈ కోట చారిత్రక ఆనవాళ్లకు తార్కాణం.







